
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025



ఇదేం 'పంచాయతీ'!

గ్రామ పంచాయతీల్లో వినియోగించే బ్లీచింగ్, సున్నం, వీధి దీపాల కొనుగోలు పాలకవర్గాలు, ఈవోలు, కార్యదర్శులకు పెద్ద సవాల్‌గా మారింది. 2017లో నిర్ణయించిన ధరలనే నేటికీ అమలు చేస్తుండటంతో పెరిగిన ధరలతో సామగ్రి కొనలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏటా మార్చిలో చేర్పులు, మార్పులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా డీపీవోలు చర్యలు తీసుకోవడంలేదు. తక్కువ మొత్తాల్లో సామగ్రి కొని సర్దలేక, ఆడిట్ అభ్యంతరాలను ఎదుర్కోలేక ఇదేం 'పంచాయతీ' అంటూ ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు.

8 ఏళ్ల క్రితం ధరలతో బ్లీచింగ్, సున్నం కొనుగోలుకు ఉత్తర్వులు

- 2017లో నిర్ణయించిన ధరలే నేటికీ అమలు
- నాడు బ్లీచింగ్ కిలో రూ.24.. నేడు రూ.45పైనే
- ఏటా మార్చిలో మార్పులు చేయాల్సి ఉన్నా పట్టించుకోని డీపీవోలు
- తక్కువ మొత్తంలో సామగ్రి కొని సర్దలేక గ్రామ పంచాయతీ ఉద్యోగుల ఇక్కట్లు


బందరు మండలం చిన్నాపురం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లావ్యాప్తంగా 474 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, వర్షాకాలం, ఇతర సీజన్‌లలో వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. నిత్యం బ్లీచింగ్, సున్నం చల్లుతూనే ఉండాలి. వీటిని జిల్లా స్థాయి కమిటీ సూచించిన కంపెనీలు, వాటికి అనుబంధంగా స్థానికంగా ఉన్న డీలర్ల నుంచి పంచాయతీలు కొనుగోలు చేయాల్సి ఉంది. జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా ఉన్న జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), ఇతర అధికారులు వీటి ధరలను ఏటా మార్చిలో నిర్ణయించి, కమిటీ ఛైర్మన్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ ఆమోదంతో అనుమతులు ఇవ్వాలి. కానీ ఈ ప్రక్రియ 2017 నుంచి నిలిచిపోయింది. 2017లో పంచాయతీలకు సరఫరా మిగతా 6లో..

ఆడిట్ అభ్యంతరాలు

పంచాయతీల్లో ఏటా ఆడిట్ నిర్వహించే సమయంలో పంచాయతీల ద్వారా కొనుగోలు చేసే సామగ్రి విషయంలో ధరల్లో వ్యత్యాసంపై ఆడిట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 2017లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కాకుండా అదనపు ధరలతో సున్నం బ్లీచింగ్, వీధిలైట్లు, ఇతరత్రా సామగ్రిని ఎలా కొనుగోలు చేశారని ఆడిట్ విభాగం అధికారులు అభ్యంతరాలు రాయడం గమనార్హం. ఈ రిపోర్టుల ఆధారంగా కొందరు వ్యక్తులు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరి పంచాయతీ పాలకవర్గాలను, ఉద్యోగులను ఇరుకునపెట్టే పనులకు పాల్పడుతున్నారని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏడేళ్ల నాటి ఉత్తర్వులను సవరించి, ప్రస్తుతం అమలులో ఉన్న ధరలకు అనుగుణంగా పంచాయతీలు సామగ్రి కొనుగోలు చేసేలా కొత్త ఉత్తర్వులు ఇవ్వాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు కోరుతున్నారు.


నున్నలో కొండవాగు పోరంబోకు స్థలంలో నిర్మాణాలు

కొండవాగులో కబ్జాకోరులు

- నున్నలో రూ.3 కోట్ల విలువైన స్థలం హాంఫట్
- వైసీపీ వార్డు సభ్యుడి భూమాయ
- వైసీపీ హయాంలోనే దర్జాగా కబ్జా
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- వెంచర్లు వేసి, ఇళ్లు నిర్మించి యథేచ్ఛగా అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, గుణదల/విజయవాడ రూరల్) : విజయవాడ రూరల్ మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ భూమి.. అసైన్డ్ భూమి.. వాగు పోరంబోకు భూమి.. ఇలా ఏదైతే మాకేంటి అన్నట్టుగా నున్నలో ఓ వైసీపీ నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. రూ.3 కోట్ల విలువచేసే కొండవాగు పోరంబోకుగా ఉన్న ఎకరం పైచిలుకు భూమిపైనా గద్దలా వాలిపోయాడు.

వైసీపీ వార్డు సభ్యుడి నిర్వాకమే..

వైసీపీ హయాంలో నున్న పంచాయతీలో ఓ వార్డు సభ్యుడు చక్రం తిప్పాడు. తాను ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరించాడు. ఆయన భార్య సర్పంచ్‌గా ఉన్నారు. దీంతో అధికారులు ఆయన చెప్పిన దానికి ఎదురుచెప్పలేకపోయారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం నున్న పంచాయతీ పరిధిలోని 151-2 సర్వే నెంబరులో పంట సాగుకు పనికిరాని ఎకరం రెండు సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సర్పంచ్ భర్త వెంచర్ వేసి, 15 నుంచి 20 ప్లాట్ల వరకు వేశాడు. ఈ ప్లాట్లకు రోడ్లు వేయడానికి విద్యుత్ శాఖ అధికారులతో కుమ్మక్కయ్యాడు. కరెంటు స్తంభాలతో పాటు ఇంటి పన్నులు కూడా వేయించేశాడు. దీనిపై గత ఏడాది ఆగస్టులో స్థానికులు విజయవాడ రూరల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా నేటి వరకు ఎలాంటి మిగతా 6లో..

ఐదేళ్ల లీజు ప్రతిపాదన తిరస్కరణ!

- దుర్గగుడిలో అగరుబత్తి, దూప్ స్టిక్స్ విక్రయ లైసెన్స్‌పై కమిషనర్ నిర్ణయం
- మరో మూడు నెలల్లో ముగియనున్న లీజు గడువు
- గత వైసీపీ హయాంలో తక్కువ అద్దెకు షాపు కేటాయింపు
- ఆ తర్వాత నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల లీజుకు ప్రతిపాదనలు
- ఈ వ్యవహారంలో చక్రం తిప్పిన ఎన్ఎంఆర్ ఉద్యోగి



గత వైసీపీ ప్రభుత్వంలో తక్కువ ధరకే దుర్గగుడిపై అగరుబత్తిలు, దూప్ స్టిక్స్ విక్రయ లైసెన్సు పొందిన సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల లీజు పొడిగింపునకు దరఖాస్తు చేసుకుంది. గత ఈవో రామారావు హయాంలో ఎన్ఎంఆర్ ఉద్యోగి చక్రం తిప్పి సదరు ప్రతిపాదనల ఫైల్‌ను దేవదాయశాఖకు చేర్చారు. దేవస్థానం లీజుల విభాగంపై దృష్టి సారించిన ప్రస్తుత ఈవో, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ తాజాగా ఈ ఫైల్‌ను తిరస్కరించడం దుర్గగుడిలో చర్చనీయాంశంగా మారింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి, ఇతర ఉపాలయాల్లో స్వామివార్లకు ఉపయోగించిన పూల నుంచి అగరుబత్తిలు, దూప్ స్టిక్స్ తయారు చేసి విక్రయించేందుకు వీలుగా రాజమండ్రికి చెందిన ఓ సంస్థకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లకు లీజుకు ఇచ్చారు. సదరు సంస్థ దేవస్థానంలోనే విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ లీజు గడువు ముగియక ముందే ఈవో రామారావు హయాంలో లీజుగడువును మరో ఐదేళ్లు పొడిగింపునకు ప్రతిపాదిస్తూ అప్పట్లో ఫైల్‌ను దేవదాయశాఖకు పంపారు. ప్రస్తుతం సదరు సంస్థ లీజు ముగియటానికి మరో మూడు నెలల గడువు మాత్రమే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్లకు గడువు పెంపుదల ప్రతిపాదన వ్యవహారంలో లీజుల విభాగంలో ఓ మిగతా 6లో..

భూమికోడు డ్రెయిన్ పూడ్చివేత

- నందివాడ మండలంలో వైసీపీ నాయకుడి బరితెగింపు
- కాలువలో తూములు పెట్టి రోడ్డు ఏర్పాటు
- ప్రశ్నించిన రైతులపై డీసీ చైర్మన్ పేరుతో బెదిరింపులు
- అనుమతులు లేవంటున్న డ్రైనేజీశాఖ అధికారులు
- ఆక్రమణదారుడికి టీడీపీ నాయకుల వత్తాసుపై విమర్శలు

నందివాడ మండలంలో వైసీపీ నేత ఒకరు బరితెగించారు. భూమికోడు డ్రెయిన్‌ను పూడ్చివేసి మరీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులపై డీసీ చైర్మన్ అనుమతి తీసుకునే నిర్మించానంటూ బెదిరింపులకు దిగుతున్నారు. రైతుల ఫిర్యాదుతో రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగిస్తామని డ్రైనేజీశాఖ అధికారులు చెబుతుంటే టీడీపీ నేతలు కొందరు ఆక్రమణదారుడికి మద్దతుగా డ్రైనేజీ ఎస్ఈని కలిసేందుకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

ఆంధ్రజ్యోతి - గుడివాడ : నందివాడ మండలం రామాపురం నుంచి పోలాసివారిపాలెం వెళ్లే దారిలో భూమికోడు డ్రెయిన్ ఉంది. దీనికి ఆనుకుని వేలాది ఎకరాల్లో చేపల చెరువులను సాగు చూస్తున్నారు. ఆయా చెరువుల రైతులు దారి కోసం డ్రెయిన్‌పై యథేచ్ఛగా ఆక్రమణలకు దిగుతున్నారు. కొందరు భూమి కోడు కాలువపై వంతెనలను నిర్మించుకోగా, మరికొందరు లారీ ఛాసిస్‌లతో దారిని ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొందరు రైతులు ఏ ప్రభుత్వం ఉంటే ఆ పార్టీ నాయకుల అండదండలతో చెలరేగిపోతున్నారు. ఇటీవల వైసీపీ నాయకుడు పోతునూరి నాగబాబు భూమికోడు డ్రెయిన్‌పై నాలుగు తూములను ఏర్పాటు చేసి కాలువను పూడ్చివేసి రోడ్డును నిర్మించుకున్నాడు. తనకు డ్రైనేజీ శాఖ, డీసీ చైర్మన్ నుంచి అనుమతులున్నాయంటూ రువాబు చేయసాగాడు. ఈ విషయమై గ్రామస్తులు డ్రైనేజీ అధికారులను సంప్రదిస్తే తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.


కాలువలో అక్రమంగా తూములు ఏర్పాటు చేసి వేసిన రోడ్డు

భవిష్యత్తులో భారీ ముప్పు

డ్రెయిన్ ఆక్రమణలతో వర్షాకాలం, తుఫాన్‌ల సమయంలో మురుగు నీరు దిగువకు వెళ్లేందుకు దారిలేకుండా పోతుంది. డ్రెయిన్ వెంబడి ఉన్న చెరువులు, పంట పొలాలు నీట మునిగే ప్రమాదముందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన బుడమేరు వరదల సమయంలో కాలువలో నీటి ప్రవాహం సజావుగా వెళ్లేందుకు దారి లేక చెరువులు, పంట పొలాలు మునిగిపోయాయని గుర్తు చేస్తున్నారు.

ఎస్ఈ స్థాయి అధికారి అనుమతి ఇస్తేనే..

భూమికోడు మధ్యస్థ కాలువగా నమోదై ఉంది. దీనిపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా నేరుగా డ్రైనేజీశాఖ ఎస్ఈ నుంచి అనుమతులు తీసుకోవలసి ఉంది. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డి.సి) ఛైర్మన్ తనకు అనుమతినిచ్చారంటూ సదరు ఆక్రమణదారుడు పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా కూడా డీసీ చైర్మన్ అనుమతులిచ్చినట్టు పేర్కొన్న దాఖలాలు లేవు. డీసీ చైర్మన్‌కు అనుమతులు ఇచ్చే అధికారం కూడా లేదు.

రెండు రోజుల్లో తొలగిస్తాం : డ్రైనేజీశాఖ డీఈ

భూమికోడు కాలువపై తూములను ఏర్పాటు చేసి నిర్మించిన రోడ్డును రెండు రోజుల్లో తొలగిస్తామని డ్రైనేజీ శాఖ డీఈ గణపతి తెలిపారు. కాలువ ఆక్రమణపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. జేఈ మిగతా 6లో..



జటిలం!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పొంచి ఉన్న నీటి ఎద్దడి

- గొంతెండుతోన్న గ్రామాలు.. వేధిస్తున్న అధికారుల కొరత!
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ లేకుండానే ఎన్టీఆర్ జిల్లాలో పాలన
- కృష్ణాలో ఖాళీగా జిల్లా అధికారి పోస్టు 6లో
- ఉమ్మడి జిల్లాలో సగం మండలాలకు ఏఈఈలు లేరు
- డిప్యూటీ సీఎం చెప్పినా ఖాళీలు భర్తీ చేయని పరిస్థితి

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

- జిల్లా స్థాయిలో 103 మంది అంగీకార పత్రాలు

6లో

ఆ ఆత్మహత్య వెనుక..

- జలవనరుల శాఖ నదీ పరిరక్షణ విభాగంలో కయ్యాలు
- ఉద్యోగి ఆత్మహత్యతో బయటపడ్డ వర్గ విభేదాలు
- చనిపోతానని ముందే అధికారులకు వినోద్ సందేశాలు
- పై అధికారులు వేధిస్తున్నారని సూసైడ్ లెటర్
- విధుల గురించి నిలదీసినందుకే.. : అధికారుల వాదన



● 'పై అధికారులు, కొంతమంది కలిసి నన్ను దారుణంగా వేధిస్తున్నారు. అందుకే చనిపోవాలనుకున్నాను.' జలవనరుల శాఖలోని నదీ పరిరక్షణ (రివర్ కన్జర్వేషన్) విభాగంలోని గుమస్తా కె.వినోద్ ఉద్యోగుల వద్ద వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అనుకున్నట్టుగానే ఆ విభాగ జేఈ శ్రీరామ జనార్దన్, విజయవాడ సెక్షన్‌లోని వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాత పేర్లు ఒక లేఖలో రాసి పురుగు మందు తాగి చనిపోయాడు. ఈ లేఖలో అధికారులతో పాటు తన అత్త కనకదుర్గ పేరు కూడా రాశాడు.

● వినోద్ సరిగ్గా విధులకు హాజరుకాడు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరవుతుంటాడు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మారలేదు. అయినప్పటికీ మానవతా దృక్పథంతో వ్యవహరించాం. నదీ పరిరక్షణ విభాగం జేఈ జనార్దన్ వాదన ఇది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి ఘంటసాల మండలం పాపవినాశనం వరకు ఉన్న సెక్షన్‌లో పనిచేసే కె.వినోద్ ఆత్మహత్యలో నదీ పరిరక్షణ విభాగంలో నడుస్తున్న గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. కొద్దిరోజుల నుంచి జలవనరుల శాఖలో పనిచేసే కొంత మంది ఉద్యోగుల వద్ద వినోద్ తన ఆవేదనను వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో ఉన్న అధికారి, మిగిలిన ఇద్దరు ఉద్యోగులు ఏవిధంగా ఇబ్బంది పెడుతున్నారో చెప్పుకొని కన్నీరుమున్నీరైనట్టు ఉద్యోగులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం వచ్చిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించడం, రుణానికి చేసుకున్న దరఖాస్తును తొక్కిపెట్టడం వంటి అంశాలను సన్నిహితుల వద్ద ప్రస్తావించాడు. తనకు ఈ విషయంలో న్యాయం చేయాలని ప్రాధేయపడినట్టు తెలుస్తోంది. అధికారులు వాదన మాత్రం భిన్నంగా ఉంది.

ఎవరూ వేధించలేదు

వినోద్ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదించగా, వారు మరో వాదనను వినిపిస్తున్నారు. డిసెంబరులో వినోద్ 20 రోజులపాటు ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యాడని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు లేఖ రాసినప్పటికీ మానవతా దృక్పథంతో మెడికల్ లీవ్‌గా పరిగణించామని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 25వ తేదీ వరకు ఈవిధంగానే గైర్హాజరయ్యాడని వివరించారు. వినోద్ కొద్దిరోజుల క్రితం ఉద్యోగుల సహకార పరపతి సంఘం నుంచి రుణానికి దరఖాస్తు చేసుకున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. దీనిపై ఆయన సంతకం చేయకుండా కార్యాలయంలో ఇచ్చాడని, సంతకం ఉంటేనే తాను సంతకం చేసి పైఅధికారులకు పంపే అవకాశం ఉంటుందని జేఈ జనార్దన్ పేర్కొన్నారు. తాను ఫోన్ చేసి సంతకం చేయడానికి పిలిచినప్పటికీ వినోద్ రాలేదని చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం పురుగు మందు డబ్బాను ఫొటోతీసి వాట్సాప్‌లో జేఈకి పంపినట్టు సమాచారం. ఆయన ఇదే విషయాన్ని లస్కర్లకు చెప్పినట్టు తెలిసింది. తర్వాత వినోద్ సతీమణితో ఫోన్‌లో మాట్లాడి అతడు చేసిన పని గురించి వివరించారని సమాచారం.

ఇసుక రీచ్ వ్యవహారంతో సంబంధం ఉందా?

తోట్లవల్లూరు మండలంలో ఒకచోట నదిలో పుష్కర ఘాట్‌ను మూసేసి, దానిపై రహదారిని నిర్మించారు. ఇక్కడి నుంచి ఇసుక తవ్వకాలు చేయడానికి ఆ ప్రాంతానికి చెందిన ఓ పెద్దమనిషి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. మరోపక్క నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రొయ్యూరు నుంచి పాపవినాశనం వరకు ఉన్న నది పరివాహక ప్రాంతంలో ఈ తవ్వకాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులకు భారీగానే ముడుపులు అందినట్టు జలవనరుల శాఖలో ప్రచారం నడుస్తోంది. ఈ వ్యవహారాలకు తనను బలి చేయడానికి చూస్తున్నారని వినోద్ తన తోటి ఉద్యోగుల వద్ద చెప్పినట్టు వినికిడి. వినోద్ అధికారుల వేధింపులతో చనిపోయాడా.. తన క్రమశిక్షణారాహిత్యం వల్ల ప్రాణాలు తీసుకునే పరిస్థితిని తెచ్చుకున్నాడా.. అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



రక్షణ కరువు

- బీమా లేని జీవితాలతో కాలం వెళ్లదీస్తున్న రక్షకభటులు
- సిబ్బంది జీపీఎఫ్‌నూ వాడేసుకొన్న గత ప్రభుత్వం

8లో

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

- పరీక్షా కేంద్రాలు 145 విద్యార్థుల సంఖ్య 21,009

కాజలో యువకుడి దారుణ హత్య

6లో

నేడు గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (గురు)
సహర్ (ఉదయం) : 5-02 (శుక్ర)



అసెంబ్లీ వేదికగా

అసెంబ్లీ వేదికగా నియోజకవర్గ సమస్యలపై బుధవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ఎమ్మెల్యేలు గళం విప్పారు. ప్రజల పక్షాన పలు సమస్యలను స్పీకర్ ఎదుట ఏకరువు పెట్టారు.

అమరావతి రాజధానికి కట్టుబడి ఉన్నాం..

» మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మూడు రాజధానులు కాదని, అమరావతి రాజధాని నినాదంతో ముందుకు వెళ్లిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శాసనమండలి సమావేశంలో బుధవారం మంత్రి రవీంద్ర వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్ర బాబు అమరావతి రాజధానికి నిధులు కేటాయింపుపై లేవనెత్తిన అంశంపై మంత్రి కౌంటర్ ఇచ్చారు. కేంద్రప్రభుత్వం అమరావతి రాజధానికి పెద్దఎత్తున నిధులు అందిస్తోందన్నారు. మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నినాదానికి రాష్ట్ర ప్రజలు దిమ్మతిరిగేలా కూటమికి మంచి మెజారిటీ ఇచ్చి గెలిపించారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : తాతయ్య



జగ్గయ్యపేట : నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలి. జగ్గయ్యపేటలో ఏకైక ఎయిడెడ్ కళాశాల 'ఎస్జీఎస్' గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రైవేటుకళాశాలగా మారిపోయింది. ప్రభుత్వ నిధులతో పలు భవనాలు, ఆడిటోరియం నిర్మించారు.. పాలకవర్గం అంగీకరిస్తే తిరిగి అక్కడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించాలి, లేనిపక్షంలో ప్రభుత్వ స్థలాల్లో కొత్త కళాశాల ఏర్పాటు చేయాలి. లేకుంటే పేద, మధ్యతరగతి వర్గాలు ఉన్నతవిద్యకు దూరమవుతారు.

వాటా ప్రకారమే సాగర్ జలాలు విడుదల చేయాలి : వసంత



జి.కొండూరు : ఎన్ఎస్పీ ఎడమ కాల్వ కింద మూడోజోన్‌లో ఉన్న పంటలకు వాటా ప్రకారం సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి. మూడోజోన్‌లో మైలవరం, తిరువూరు, నూజివీడు తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇందుకుగాను హక్కుగా 32 టీఎంసీ జలాలు కేటాయించారు. ఈఏడాది ఇప్పటి వరకు పలు సందర్భాల్లో 18 టీఎంసీలు మాత్రమే నీరు విడుదల చేసినా.. ఇంకా 13 టీఎంసీల సాగునీరు విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుత వ్యవసాయ సీజన్ ముగుస్తున్న తరుణంలో ఆరుతడి పంటలకు సాగునీరు అత్యవసరం. ఈవిషయాన్ని ఇప్పటికే మంత్రి, ఈఎన్సీని కలిసి విజ్ఞప్తి చేశా.

అడవి ఆవుల నుంచి రక్షణ కల్పించాలి : సౌమ్య



నందిగామ : అడవి ఆవుల వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలి. చందర్లపాడు మండలంలోని కృష్ణాపరివాహక గ్రామాలలో పెద్ద సంఖ్యలో అడవి ఆవులు ఉన్నాయి. రాత్రి వేళ ఆవులు పంట పొలాను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటి నుంచి పంటల రక్షణకు ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

గన్నవరంలో అక్రమ మైనింగ్ విచారణలో పురోగతి చెప్పండి : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ మైనింగ్‌పై విచారణ పురోగతి తెలియజేయాలి. ఇసుక పాలసీ తరహాలో గ్రావెల్‌కు కూడా నూతన పాలసీ తీసుకురావాలి. డీఎంఎఫ్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడుతుంది. గన్నవరం విమానాశ్రయం నుంచి హనుమాన్ జంక్షన్ వైపు 45వేల చదరపు మీటర్ల గ్రీనరీ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెనల నిర్మాణం చేయాలి. 479 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరణ చేయాల్సిన అవసరం ఉంది. 183 మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

టూరిజం, కల్చర్‌కు నిధుల కేటాయింపు హర్షణీయం : వర్ల



పామర్రు : టూరిజం అండ్ ఆర్ట్‌కు రూ.269 కోట్లు కేటాయించటం హర్షనీయం. నియోజకవర్గంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న కూచిపూడిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వంటి మహనీయులు జన్మించింది ఇక్కడే.. కూచిపూడి సంస్కృతితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించటం హర్షణీయం.

కాలువ పనులు నీటి సంఘాలకు అప్పగించండి : వెనిగండ్ల



గుడివాడ : నియోజకవర్గంలో కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నీటి సంఘాలకు అప్పగించాలి. 2019-24 నీటి సంఘాలను రద్దు చేయడంతో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమై విధ్వంసం జరిగింది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 60వేల మంది రైతులు భాగస్వామ్యంతో తిరిగి నీటి సంఘాలకు పునరుద్ధరించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రూ.10లక్షల వరకు పనులను నామినేటెడ్ పద్ధతిలో స్థానిక నీటి సంఘాలకు అప్పగించేలా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

భూమికోడు డ్రెయిన్ పూడ్చివేత

(5వ పేజీ తరువాయి)

అరుణ్‌కుమార్‌ను పంపి విచారణ చేయగా, కాలువపై అనుమతులు లేకుండా తూములను ఏర్పాటు చేసి రోడ్డు నిర్మించినట్లు స్పష్టమైందన్నారు. చెరువుయజమానికి నిర్మాణాన్ని తొలగించాలంటూ ఐదు రోజుల గడువు ఇచ్చామని, ఎటువంటి స్పందన లేదన్నారు. పోలీసుల సాయంలో తూములను తామే తొలగిస్తామని వివరించారు.

ఎస్ఈని కలిసేందుకు వెళ్లిన డీసీ చైర్మన్



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

భూమికోడు కాలువపై ఏర్పాటు చేసిన తూములను తొలగించే నిమిత్తం డ్రైనేజీ అధికారులు బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లారు. దీంతో డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి నేతృత్వంలో చేపల చెరువుల రైతులు, ఆక్రమణదారుడు, మండల స్థాయి ప్రజాప్రతినిధి ఒకరు డ్రైనేజీ శాఖ ఎస్ఈని కలిసేందుకు వెళ్లినట్లు సమాచారం. వైసీపీ నాయకుడు భూమికోడు డ్రెయిన్‌పై అక్రమంగా తూములను ఏర్పాటు చేస్తే, దానికి కొందరు టీడీపీ నాయకులు వత్తాసు పలకడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

జటిలం!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)స్థాయి అధికారులు లేరు. ఎన్టీఆర్ జిల్లాలో ఈఈకి ఎఫ్ఏసీగా ఎస్ఈ బాధ్యతలు అప్పగించగా.. కృష్ణాజిల్లాలో డీఈఈకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి (డీఆర్ఈ)గా అదనపు బాధ్యతలను అప్పగించారు. క్షేత్రస్థాయిలో ఏఈఈలు లేక విధులను నిర్వహించటమే కష్టమైపోతుంటే.. అదనపు బాధ్యతలను అప్పగించటం వల్ల పర్యవేక్షణ కరువైంది.

ఎన్టీఆర్ జిల్లాలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఉంది. జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ సబ్ డివిజన్ల పరిధిలో డీఈఈలు ఉన్నా సగం మండలాల పరిధిలో ఖాళీలు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ (డీఆర్ఈ) కార్యాలయంతో పాటు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంతో పాటు బందరు, అవనిగడ్డ, గుడివాడ, పామర్రు, పెనమలూరు, గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో సగం మండలాలలో ఏఈలు లేరు. ఈ ప్రభావం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్ఈ కార్యాలయాలపైన పడుతోంది. ప్రస్తుతం ఓఅండ్ఎం స్కీమ్‌లను పర్యవేక్షించటం కూడా కష్టమవుతోంది. పనులను పర్యవేక్షించటం, జల్‌జీవన్ మిషన్ కింద చేపడుతున్న ఆన్‌గోయింగ్, టెండరింగ్, డీపీఆర్ స్టేజీలో ఉన్న పనులు, ప్రతిపాదనలను పర్యవేక్షించటం, పరిశీలించటం చేయాల్సి ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జిలుగా ఉన్నవారు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఎస్ఈ పోస్టులు ఉండగా కేవలం ముగ్గురే పనిచేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులు నూరు శాతం పూర్తయి ఉంటే ఉమ్మడి జిల్లాలో నీటి ఎద్దడి ఉండేది కాదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జేజేఎం పనులను అపహాస్యం చేశారు. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌తోనే పనులు చేసి సగంలో వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవటంతో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అప్పట్లో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటంతో వదిలేసిన పనులు ఉన్నాయి. ఈ కారణాల వల్ల ఈ వేసవిలో కూడా నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి.

> మండేకాలం వచ్చేసింది. ప్రారంభంలోనే భానుడు భగ భగలాడుతున్నాడు. ఇప్పటికే పలుచోట్ల ప్రజల గొంతెండిపోతోంది! అక్కడక్కడ నీటి ఎద్దడి ఉత్పన్నం కానుంది. గ్రామీణ నీటిసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏ పని ముందుకు కదలని పరిస్థితి. స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలుమార్లు ఖాళీలను భర్తీ చేయాలని చెప్పినా ఉన్నతాధికారులకు పట్టడం లేదు. దీంతో ఈ వేసవిలో నీటి ఎద్దడి పరిస్థితులను ఎలా చక్కదిద్దుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- » మండలాలకు పొంచి ఉన్న నీటి ఎద్దడి ముప్పు
- » ఇప్పటికే గొంతెండుతోన్న గ్రామాలు
- » ఆర్‌డబ్ల్యూఎస్‌లో అధికారుల కొరత!
- » ఎస్ఈ లేకుండానే ఎన్టీఆర్ జిల్లాలో పాలన
- » కృష్ణాజిల్లాలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పోస్టు ఖాళీ
- » ఉమ్మడి జిల్లాలో సగం మండలాలకు ఏఈఈలు లేరు
- » క్షేత్రస్థాయిలో పనులు సాగక ఇన్‌చార్జిల ఇబ్బందులు
- » ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు సీఈ పోస్టులు ఖాళీ
- » డిప్యూటీ సీఎం చెప్పినా ఖాళీలు భర్తీ చేయని పరిస్థితి



ఉమ్మడి కృష్ణా జిల్లాలో నీటి ఎద్దడి మండలాలు ఇవే..

ఎన్టీఆర్ జిల్లాలో పశ్చిమ ఎన్టీఆర్ ప్రాంతంలో వీరులపాడు, వత్సవాయి మండలాలు నీటి ఎద్దడిని ఎదుర్కొనే జాబితాలో ఉన్నాయి. అలాగే ఉత్తర ఎన్టీఆర్ జిల్లాలో ఏ కొండూరు మండలం, తిరువూరు పట్టణం, గంపలగూడెం ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. అలాగే కృష్ణాజిల్లాలో కృత్తివెన్ను, మచిలీపట్నం రూరల్, బంటుమిల్లి, నందివాడ, గుడివాడ రూరల్ మండలాల ప్రాంతాలలో తీవ్ర నీటి ఎద్దడి కొరత ఉంది. ఇన్‌చార్జిలు జిల్లా స్థాయి పరిపాలనా వ్యవహారాల మీద దృష్టి సారించలేకపోతున్నారు.

గొల్లపూడిలోని ఈఎన్‌సీ కార్యాలయంలో సీఈల కొరత

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం పరిస్థితి ఇలాగే ఉంది. ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టు ఖాళీగా ఉంది. ఒక సీఈకి ఈఎన్‌సీ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. సీఈలుగా సీనియారిటీ ప్రకారం నియమించుకునే అవకాశం ఉన్నా ఉన్నతాధికారులు ఆ పనిచేయటం లేదు. ఖాళీ సీఈ పోస్టులకు సీనియారిటీ లేకుండా వేరొకరి పేరును ఉన్నతాధికారులు తెరమీదకు తెచ్చారు. గతంలోనూ సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా కొందరు అనధికారికంగా పదోన్నతులు పొందారు. దీనిపై కోర్టు విచారణ నడుస్తోంది. ఈఎన్‌సీ కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఇక జిల్లా స్థాయిలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాల్సిందే.

పోర్టు అనుసంధాన రోడ్లకు ప్రతిపాదనలు

» మోర్త్, నేషనల్ హైవే అధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం

విజయవాడ కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టుకు అవసరమైన అనుబంధ రోడ్ల అభివృద్ధికి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మోర్త్ అండ్ నేషనల్ హైవే అధికారులతో బుధవారం ఎంపీ బాలశౌరి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా ఇటీవల ఢిల్లీలో కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి పోర్టు అనుసంధానించ వలసిన రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోరగా, మంత్రి వెంటనే నివేదికలు సమర్పించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

ప్రధానంగా పోర్టు నుంచి బందరులోని మాచవరం రైస్‌మిల్ సెంటర్ వరకు 3.7 కి.మీ వరకు 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి, మాచవరం రైస్‌మిల్ సెంటర్ నుంచి నేషనల్ హైవే 65 వద్ద వున్న అండర్‌పాస్ వరకు 4 కి.మీ వరకు ప్రస్తుతం వున్న 2 వరుసల రహదారిని 4 వరుసల రహదారిగా అభివృద్ధి పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు. ఈ విషయమై మోర్త్ అధికారులు డీపీఆర్ తయారుచేయడం జరిగిందని, మొత్తం 12.6 కి.మీకి రూ.583 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఒకచోట రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఒకచోట ఫ్లైఓవర్, ఒకచోట వెహికల్ ఓవర్‌పాస్, ఆరుచోట్ల వెహికల్ అండర్‌పాస్‌లు, 6 చోట్ల వెహికల్ అండర్‌పాస్‌లు నిర్మించడం జరుగుతుందని ఎంపీకి తెలియజేశారు. అలాగే మరో ముఖ్యమైన రోడ్డు గుడివాడ పట్టణంలో ప్రయాణికుల రద్దీని తట్టుకోవడానికి 2.80 కి.మీ సుమారుగా 18 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు తయారుచేయడం జరిగిందని, 4 వరుసల రహదారిని 216-హెచ్ నేషనల్ హైవేతో కలిపే నిమిత్తం, మధ్యలో డివైడర్‌లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ సౌకర్యంతో అధునాతనంగా రహదారి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నామని, నాగవరప్పాడు బ్రిడ్జి నుంచి వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కాలేజీ వరకు డ్రైన్లు, ఫుట్‌పాత్‌లు, స్ట్రీట్ లైటింగ్, డివైడర్‌లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, అలాగే ఎన్‌హెచ్ 165 నుంచి ఎన్‌హెచ్ 216 హెచ్ వరకు రూ.9 కోట్లతో రోడ్డు విస్తరణకు 3 కి.మీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల సూచనలు, సలహాలతో తగు విధంగా డీపీఆర్ తయారుచేసి త్వరలో కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కేంద్రానికి చేరిన వెంటనే ఢిల్లీలో నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ బాలశౌరి తెలిపారు. సమావేశంలో మోర్త్ రీజనల్ ఆఫీసర్ రాకేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాస్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ ఈఈ సంజీవ రాయుడు, డీఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



మోర్త్ అధికారులతో చర్చిస్తున్న ఎంపీ బాలశౌరి

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

వన్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవాడ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6, 7, 8వ తరగతుల్లో (బ్యాక్‌లాగ్) మిగిలిఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముస్లిం (బీసీ-ఈ, బీసీ-బీ), బీసీ-సి (కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థినులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మార్చి1 నుంచి 31వ తేదీలోగా ఆన్‌లౌన్‌లో, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాలకు 8712625036 నెంబరులో సంప్రదించాలని తెలిపారు. శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా వరకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోచ్చన్నారు.

కాజలో యువకుడి దారుణ హత్య



సంఘటనా స్థలం వద్ద పోలీసుల విచారణ, రాజేష్ (ఫైల్)

కూచిపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : యువకుడి హత్యతో కాజ గ్రామం ఉలిక్కి పడింది. మృతుడి తల్లి రాజులపాటి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. రామలక్ష్మి కుమారుడు రాజులపాటి వీర వెంకట రాజేష్ (27) ఫిబ్రవరి 26న మహాశివరాత్రి ముందురోజు కాజ గ్రామంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడు. ఆ సమయంలో జోగి శివ, మధుసూదన్ రెడ్డి, బొల్లా శ్రీను, తాతా హరికృష్ణలు రాజేష్‌తో గొడవ పడ్డారు. దాంతో మధుసూదన్ రెడ్డి రాజేష్‌పై కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఈనెల 4వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో కేసు రాజీ చేసుకుందామని నిందితులు మోటారు సైకిల్‌పై రాజేష్‌ను ఇంటినుంచి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టి హత్యచేసి మృతదేహాన్ని ఐనంపూడి కాల్వలో పడేశారని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐ వి.శుభాకర్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంలు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

» కృష్ణా జిల్లాలో 103 మంది కార్యదర్శుల అంగీకార పత్రాలు



అంగీకార పత్రాలు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మచిలీపట్నం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. 497 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శుల సీనియారిటీ జాబితాలను బుధవారం ప్రకటించారు. 547 మంది కార్యదర్శులతో సీనియారిటీ జాబితాలను బుధవారం వెల్లడించారు. గ్రేడ్ 1, 2, 3, 4, 5, 6 పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాలను ప్రకటించారు. ఇందులో భాగంగా ముందుగా జిల్లా స్థాయిలో 103 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తున్నారు. గ్రేడ్ 4లో ఉండే 77 మంది సీనియర్లకు గ్రేడ్ 5లో భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే విధంగా గ్రేడ్ 2లో ఉండే 36 మందికి పదోన్నతులు కల్పించనున్నారు. ఇందుకుగాను సీనియారిటీ జాబితాలను ప్రకటించిన కార్యదర్శులకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు సీనియారిటీ లిస్టులోని తమ పేర్లను సరి చూసుకున్నారు. 77 మంది గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులు, 36 మంది గ్రేడ్ 2 కార్యదర్శులు పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చారు. చాలాకాలం తరువాత పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తున్నారు. కాగా గ్రేడ్ 1,2 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు ప్రభుత్వం నేరుగా నిర్వహిస్తుంది. డిఎల్‌పివో సత్యనారాయణ, కార్యాలయ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐదేళ్ల లీజు ప్రతిపాదన తిరస్కరణ!

(5వ పేజీ తరువాయి)

ఎస్ఎంఆర్ ఉద్యోగి చక్రం తిప్పారని సమాచారం. అధికారులందరినీ పక్కన పెట్టి ఎస్ఎంఆర్ ఉద్యోగి తానొక్కడే గడువు పెంపునకు ప్రతిపాదన చేసినట్టుగా తెలుస్తోంది. సంబంధిత లీజు సంస్థకు ఎస్ఎంఆర్ ఉద్యోగే ఉచిత సలహా ఇచ్చి దరఖాస్తు పెట్టించాడని సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా రెండేళ్ల లీజును ఏకంగా ఐదేళ్లకు ప్రతిపాదిస్తూ ఫైల్‌ను సిద్ధం చేశారు. ఈ ఫైల్‌ను సిద్ధం చేయటం వెనుక రూ.10 లక్షల డీల్ నడిచిందని సమాచారం.

అనుమానాలెన్నో..

ఈ లీజు పెంపు ప్రతిపాదన వ్యవహారంలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. నెలకు రూ.1.60 లక్షల అద్దె ప్రాతిపదికన ఆ సంస్థకు దేవస్థానంలో స్టాల్ అప్పగించటం జరిగింది. ద్వారకా తిరుమలలో ఇదే సంస్థ రూ.1.80 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయంగా ఉన్న ఇంద్రకీలాద్రిపై తక్కువ అద్దెకు స్టాల్ కేటాయింపుపై తీవ్ర విమర్శలు కూడా వస్తున్నాయి. అగరబత్తి ప్యాకెట్ ధర రూ.100గా నిర్ణయించి విక్రయిస్తున్నారు. అగరబత్తి కొన్న వారికి ఒక కీ చైన్‌ను కూడా బహుమతిగా ఇస్తున్నారు. తక్కువ అద్దెతో ఐదేళ్ల లీజు పొడిగించుకోవటం ద్వారా భారీగా ఆదాయం పొందేందుకు పావులు కదిపింది. అయితే సదరు సంస్థ అమ్మవారి ఆలయంలో వాడిన పూలతోనే అగరబత్తిలను తయారు చేయిస్తుందా అన్నదానిపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం నుంచి పువ్వులు తీసుకోవటం లేదని, రసాయనాలతో తయారు చేసిన అగరబత్తిలనే విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని దేవదాయశాఖ కమిషనర్ లీజు గడువు ఐదేళ్లకు పెంపు ప్రతిపాదనను రద్దు చేసినట్టు తెలుస్తోంది.

లీజుల విభాగంపై ఈవో దృష్టి

దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ప్రస్తుతం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా కూడా వ్యవహరిస్తుండటంతో లీజుల విభాగంపై దృష్టి సారించినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా కూడా విచారణ జరిపినట్టు తెలిసింది. సూపరింటెండెంట్‌కు తెలియకుండానే ప్రతిపాదన సిద్ధమైనట్టు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో వేళ్లన్నీ ఎస్ఎంఆర్ ఉద్యోగివైపే చూపిస్తున్నాయి. లీజుల విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఎస్ఎంఆర్ ఉద్యోగి కాంట్రాక్టర్లతో అత్యంత సన్నిహితంగా ఉంటాడని సమాచారం. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఏం చేయాలో కూడా ఉచిత సలహాలు ఇస్తాడన్న విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు లబ్ధి కలిగించే సలహాలు ఇవ్వటం ద్వారా భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. సదరు ఉద్యోగిపై ప్రస్తుత ఈవో దృష్టికి ఫిర్యాదులు వచ్చినట్టుగా తెలుస్తోంది.

ఇదేం 'పంచాయతీ'!

(5వ పేజీ తరువాయి)

చేసే బ్లీచింగ్ కిలో ధరను రూ.24గా నిర్ణయించారు. రాష్ట్రంలోని కర్నూల్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని కంపెనీలకు జిల్లాలో అనుబంధంగా ఉన్న అధీకృత డీలర్ల నుంచి బ్లీచింగ్ కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం డివిజన్‌లోని పంచాయతీలు ఏయే డీలర్‌ల నుంచి బ్లీచింగ్, సున్నం, వీధిలైట్లు, ఇతర సామగ్రిని కొనుగోలు చేయాలో నిర్ణయించారు. పంచాయతీలకు వచ్చిన బ్లీచింగ్, వీధిలైట్లు, ఇతర సామగ్రి నాణ్యతగా ఉందో లేదో పంచాయతీ సర్పంచ్‌లు పరిశీలించాలి. నిబంధనలకు అనుగుణంగా ఉంటే బిల్లులను డీడీలు, చెక్‌ల రూపంలో చెల్లించాలనే నిబంధన ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా 2017లో జారీచేసిన ఉత్తర్వుల్లోని ధరలు నేటికీ అమలు కావడం గమనార్హం. 2017లో కిలో బ్లీచింగ్ రూ.24 ధర ఉండగా, ప్రస్తుతం రూ.42 నుంచి రూ.45 వరకు ధర పలుకుతోంది. గతంలో పంచాయతీల్లో వీధిదీపాలుగా ట్యూబ్‌లైట్లను వాడేవారు. ప్రస్తుతం వాటిస్థానంలో ఎల్ఈడీ బల్బులు వాడకంలోకి వచ్చాయి. ప్రస్తుతం ట్యూబ్‌లైట్‌లు కొనుగోలు చేయాలో, ఎల్ఈడీ బల్బులు కొనుగోలు చేయాలో తేల్చడం లేదు. పాత ఉత్తర్వులను సవరించకపోవడంతో పంచాయతీ పాలకవర్గాలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీ పాలకవర్గాలు అయితే తక్కువ మొత్తంలో బ్లీచింగ్, సున్నం, వీధిలైట్లను కొనుగోలు చేసి కొత్త ధరలకు సరిపడా లెక్కలు చూపాల్సినస్థితి నెలకొంది. గతంలో పంచాయతీల్లో వాల్యుయాడెడ్ ట్యాక్స్ అమలులో ఉండేది. ఈ పద్ధతి పోయి జీఎస్టీ అమలులోకి వచ్చింది. పంచాయతీల ద్వారా కొనుగోలు చేసే సామగ్రికి జీఎస్టీ అమలయ్యే అంశంలోనూ గందరగోళం నెలకొందని పంచాయతీ ఈవోలు, కార్యదర్శులు చెబుతున్నారు.

కొండవాగులో కబ్జాకోరులు

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకోలేదు. విద్యుత్‌శాఖ అధికారులు మొదలు.. పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఈ వ్యవహారంలో ఎంతో కొంత డబ్బులు ముట్టడం వల్లే.. సదరు వైసీపీ నాయకుడికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈయన వేసిన వెంచర్‌లోని స్థలాల్లో ఇళ్లు నిర్మించడమే కాదు.. చాలావరకు అమ్మేశాడు కూడా. నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను తడిపేందుకు కూడా ఈ వైసీపీ నేత.. పంచాయతీ సిబ్బందినే ఉపయోగించడం గమనార్హం. వాగు పోరంబోకు స్థలంలో నిర్మాణాలు ఏమిటని కొంతమంది అడుగుతుండటంతో 'ఇది నా స్థలమే' అని బుకాయిస్తూ కోర్టు నుంచి స్టేటస్‌కో తెచ్చుకున్నట్టుగా సమాచారం. సదరు స్థలాల్లో సోమవారం ఎర్రమట్టి తోలించి చదును చేయించాడు. కోర్టును తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూమిని సైతం తనదే అని నమ్మిస్తున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

మచిలీపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గీత సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 12 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిన కేటాయించనున్నట్టు జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 9.30గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో లాటరీతీసి షాపులను కేటాయిస్తామని ఆయన తెలిపారు. మద్యం షాపులకోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ జలక్రీడలకు నాగాయలంక వాసి



నాగాయలంక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ జలక్రీడల పోటీలకు ఎంపికైనట్టు జలక్రీడల శాఖ అధికారిణి కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. ఈనెల 7 నుంచి 12వరకు థాయిలాండ్‌లో జరగనున్న జూనియర్, సీనియర్ విభాగాలలో కెనియో స్లాలోమ్ జలక్రీడల ఈవెంట్లలో గాయత్రి పాల్గొననున్నారు. గాయత్రి ఎంపిక పట్ల మండల ప్రజా ప్రతినిధులు, సామాజికవర్గాలు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన నేతల ఫిర్యాదు

కంకిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ దువ్వాడపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల ప్రధాన కార్యదర్శి సుంకర శివ అన్నారు. దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు జనసేన, టీడీపీ నాయకులపై ఇష్టానుసారంగా దుర్భాషలాడారన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీ నాయకులకు సిగ్గు రాకపోవడం సిగ్గు చేటన్నారు. పవన్ కల్యాణ్‌పై అనుచిత వాఖ్యలు చేసిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో
హుండీ కానుకల లెక్కింపు

విజయవాడ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని తొమ్మిది హుండీలు, ఒక తాత్కాలిక హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళ వారం జరిగింది. 2024 డిసెంబరు 6వ తేదీ నుంచి 2025 మార్చి 4వ తేదీ వరకు ఆదాయం రూ.13, 38,788 వచ్చినట్టు వన్‌టౌన్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్.సన్యాసిరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, దుర్గా శివసాయి సంఘం సభ్యులు పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయమే వృత్తిగా జీవనం సాగిస్తూ పంటలు పండించిన దన్నె సూరయ్య (102) బుధవారం మృతి చెందారు. కానుమోలుకు చెందిన దన్నె సూరయ్యకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, భార్య కొంత కాలం క్రితం మృతి చెందిందని బంధువులు తెలిపారు. ఎంతదూరమైనా కాలినడకనే వెళ్లివస్తుండేవారని, మృతి చెందే వరకూ ఎవరిపైనా ఆధారపడకుండా పొలం పనులు చేసుకున్నారని బంధువులు తెలిపారు.



సూరయ్య (102)

ఘంటసాల సంగీత కళా సమితి ఆధ్వర్యంలో
బాలబాలికల పాటల పోటీలు రేపు

హనుమాన్‌జంక్షన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల సంగీత కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 7న అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బాలబాలికలకు పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ ఎనికేపల్లి రాఘవేంద్రరావు తెలిపారు. బాలబాలికల్లో దాగి ఉన్న సంగీత ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రం అందిస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి పోటీలు, అనంతరం పాటల కచేరి ఉంటుందని రాఘవేంద్రరావు పేర్కొన్నారు.

జాతీయ పురస్కారానికి నాగశిరోమణి ఎంపిక

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి గ్రామానికి చెందిన హిందీ ప్రచారక్, సహజయోగ సాధకురాలు, ఏపీ ఎన్ ఆర్ ఐ విభాగం ఉద్యోగి సగ్గుర్తి నాగశిరోమణి నారీరత్న ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్-2025 జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ గాంధీనగర్‌లో జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్సు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నాగశిరోమణికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరులు అభినందనలు తెలిపారు.

రేపు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉంగుటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఈ నెల 7వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శుక్రవారం డ్వామా పీడీ ఎన్‌వీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికలో ప్రత్యేక బృందాలు సమర్పించిన నివేదికలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల డ్రా నేడు

ఉయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్నవారికి గురువారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డ్రా తీస్తారని సీఐ శేషగిరిరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 8గంటలకే కలెక్టరేట్‌కు చేరుకోవాలని తెలిపారు.

తాగునీరు వృథా!

- లీకైన పైపులైన్
- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి ఎమ్మెల్సీ రోడ్డు సమీపాన పైప్‌లైన్ లీకై రోజుల తరబడి తాగునీరు వృథాగా పోతుంది. పట్టణంలో చాలా వరకు మెయిన్ పైప్‌లైన్లు రోడ్లపైనే ఉండగా చాలా చోట్ల లీకై నీరు వృథాగా పోతున్నా పట్టించుకున్నవారు లేరు. నీటి సరఫరా సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడడంతో విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం సమీపించిన పరిస్థితుల్లో నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు శ్రద్ధ చూపకపోవడంతో పైప్‌లైన్లు లీకై చాలా చోట్ల నీరు వృథాగా పోతుంది. కొన్ని చోట్ల లీకుల్లో మురుగు చేరి, తమ కుళాయిల నుంచి మురుగు నీరు వస్తుందని పలువురు వాపోతున్నారు. లీకులపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టిపెట్టకపోవడం పట్ల సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరాపై దృష్టి చారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్సీ రోడ్డు సమీపాన మెయిన్ పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

చకచకా డిప్యూటీ సీఎం సభ ఏర్పాట్లు

7న స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభించనున్న పవన్ కల్యాణ్

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలలో ఈ నెల 7న స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభం కార్యక్రమానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో బాలసుబ్రమణ్యంలు బుధవారం పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సభావేదిక, ప్రజలు కూర్చునేందుకు గ్యాలరీలు, వాహనాల పార్కింగ్‌పై చర్చించారు. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభానికి వచ్చే అతిథులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. 5వేల మందితో సభ నిర్వహించనున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఎంపీడీవో టి.స్వర్ణలత తదితర అధికారులు పాల్గొన్నారు.



యంత్రాలతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



పెరికీడు జేఎంజే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో దీక్షాదారులు

భక్తిశ్రద్ధలతో తపస్సు కాలం ప్రారంభం

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తపస్సు కాలాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రెవరెండ్ ఫాదర్ ఎస్.కిషోర్ అన్నారు. మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం చర్చిలో విబూది బుధవారం సందర్భంగా దివ్యబలిపూజను సమర్పించారు. ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ 40 రోజులు తపస్సు కాలంలో ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగిన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు పశ్చాత్తాపం కలిగి ఉండలని, ఉపవాసం, దాన ధర్మాలు, ప్రతిరోజు ప్రార్థన చేసుకోవా లన్నారు. భక్తుల నుదుటి మీద విబూదితో సిలువ గుర్తువేశారు. రెవరెండ్ ఫాదర్ సందీప్, సంఘ పెద్దలు, మరియదళం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : క్రైస్తవ విశ్వాసులు భక్తి శ్రద్ధలతో ఉపవాస ధ్యానం ఆచరించే కాలం విబూది బుధవారంతో ప్రారంభమౌతుందని, తపస్సు కాలంలో దేవునికి దగ్గరగా మెలగాలని ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి మాలదారులకు సూచించారు. పెరికీడులోని జెఎంజె చర్చి ఆవరణలో విబూది (భస్మ) బుధవారం నుంచి శ్రమదినాల సందర్భంగా 300మంది తపో దీక్షాదారులకు నియమాలను బోధిస్తూ మాలధారణ చేశారు. ఉపవాస దీక్ష కాలమైన 40రోజుల పాటు ప్రతి ఒక్కరూ ప్రార్థన, ఉపవాసం, దానధర్మాలు పాటించాలని, దీక్షా నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెఎంజె సిస్టర్స్, పారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో 40 రోజులపాటు ఉపవాసధ్యానంలో ఆచరించే తపస్సు కాలాన్ని శ్రమల కాలం అంటారని, ప్రత్యేక ఉపవాసాలు, ప్రార్థనలతో క్రీస్తు శ్రమలను ధ్యానిస్తూ, ఆధ్యాత్మికంగా మరింత బలోపేతం కావడానికి శ్రమలకాలం ఎంతో ఉపయోగపడుతుందని ఫాదర్ గోళ్ల విజయకుమార్ అన్నారు. క్రైస్తవ విశ్వాసులు అత్యంత పవిత్రంగా భావించే శ్రమల కాలం దీక్షలు మండలవ్యాప్తంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తేలప్రోలు విచారణ దేవాలయంలో ఫాదర్ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన మండల కాల దీక్షాధారణ కార్యక్రమంలో 50మందికి పైగా క్రైస్తవులు పవిత్ర దీక్ష తీసుకున్నారు.



తేలప్రోలు విచారణ దేవాలయంలో..

ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గందరగోళం

ఖాతాదారులకు తెలియకుండానే నగదు కట్ అవుతున్నట్టు ప్రచారం

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంకుకు చెందిన పలువురు ఖాతాదారులు గందరగోళానికి గురయ్యారు. తమ ఖాతాల్లోని నగదు కట్ అయినట్లు మెసేజ్‌లు రావటంతో బుధవారం ఎస్‌బీఐ బ్యాంకుకు పరుగులు తీశారు. ఎందుకు తమ నగదు కట్ అయ్యాయో అని బ్యాంకు అధికారులను అడిగితే సరైన సమాధానం రాలేదు. పెద అవుటపల్లికి చెందిన ఒక మహిళ ఖాతా నుంచి రూ.3,600 నగదు కట్ అయ్యాయి. బ్యాంకుకు వెళ్లి ఎందుకు డబ్బులు కట్ చేశారని ప్రశ్నించగా తమకేమి తెలియదని, అదేమంటే ఐదేళ్ల క్రితం పెండింగ్ చార్జీలు కట్ అయినట్లు చెబుతున్నారని తెలిపారు. అలాగే గన్నవరానికి చెందిన ఒక వ్యక్తి ఖాతా నుంచి రూ.7,800 కట్ అయ్యాయి. కొందరి ఖాతాలు మైనస్‌లోకి వెళ్లాయి. దీంతో వారంతా ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు చేరుకొని అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఖాతాదారుల కేకలతో కొద్దిసేపు బ్యాంకు వద్ద గందరగోళం వాతావరణం నెలకొంది. నగదు కట్ అయిన వారంతా లెటర్‌లు ఇస్తే మెయిల్ పెడతామని రెండు, మూడు రోజులు సమయం పడుతుందని చెప్పటంతో ఖాతాదారులు శాంతించారు. ఎస్‌బీఐ అధికారుల తీరుపై ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ బీవీ శివ ప్రసాద్

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల ఆందోళన

ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ప్రధాన గేటు మూసి నిరసన

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : స్టైఫండ్ పెంచాలని నెల రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు తమ ఆందోళనను తీవ్రతరం చేశారు. మండలంలోని కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ప్రధాన గేటును బుధవారం మూసివేసి బోధన, బోధనేతర సిబ్బంది, వర్కర్‌లను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ బీవి శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కళాశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే గేటు బయట వాహనాలు నిలిచిపోయాయి. సీఐ విద్యార్థులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ కంచాలను గరిటెలతో మోగిస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు భాను ప్రకాష్, ధర్మతేజ, పునీత్, వర్మ, మాట్లాడుతూ, ఉపకారవేతనాలు పెంచాలని రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవటందారుణమని, న్యాయమైన కోర్కెలను పరిష్కరించమంటే స్పందించక పోవటం బాధాకరమన్నారు. కళాశాల హాస్టల్ ఖాళీ చేయాలని, మెస్ మూసివేయాలని సర్క్యులర్ జారీ చేయటం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా జరుపుతున్న తమ నిరసనను పోలీసులతో భగ్నం చేయించటం సరికాదన్నారు.

వైజ్ఞానిక పరికరాలను రూపొందించాలి


ప్రసాదంపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన వైజ్ఞానిక పరికరాలను రూపొందించాలని, ఆయా పరికరాలు నేటి మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఏపీఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ జీ.కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం ఎనికేపాడులోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే సావిషేకర్-2025ను ఆయన ప్రారంభించారు. తొలిరోజు సాంస్కృతిక ప్రదర్శనలు, టెక్నికల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా ప్రదర్శనలను పెనమలూరు, నందిగామ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జీ.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, సోలార్ సిటీ, డ్రోన్ టెక్నాలజీ, హైడ్రో రోడ్స్ వంటివి ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. అవేరా కో ఫౌండర్ చాందిని చందన పలు విభాగాల ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, కార్యదర్శి బి. కృష్ణారావు పోటీల్లో పాల్గొనే విద్యార్థులను అభినందన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి. వెంకటేశ్వరరావు, విభాగాధిపతులు పి. సుబ్బయ్య, రాఘవలక్ష్మి, విష్ణుప్రియ, కె.మురళి, మధుశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అవేరా కో ఫౌండర్ చాందిని చందన, జీ.కిషోర్ కుమార్

విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, నిశితంగా పరిశీలిం చడంతో పాటు ప్రయోగాత్మక వైఖరిని పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ (విజ్ఞాన ప్రదర్శన) దోహదపడుతుందని ప్రిన్సిపాల్ నందింగం రవికుమార్ అన్నారు. వీరవల్లిలోని వాణీ విద్యానికేతన్ ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన బయో డైవర్సిటీ వినియోగం, సోలార్ ఎనర్జీ, న్యూటన్ పెండ్యులమ్ తదితర ఆవిష్కరణలను బుధవారం నిర్వహిం చిన సైన్స్ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. లేజర్ సెక్యూరిటీ అలారం, గ్యాస్ లీకేజీ డిటెక్టర్, ఫోటో సింథసిస్ లాంటి ప్రాజెక్ట్‌లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కోతుల బెడదను నివారించే కార్బైడ్ గన్‌పై ఆసక్తి ప్రదర్శించి, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



డాక్టర్ శాంతి సేవలు అభినందనీయం

ఉయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వైద్యురాలిగా సేవలందిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న డాక్టర్ శాంతి సేవలు అభినందనీయమని ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్రా సుధారాణి, అన్నే రాణి, ఎల్ సూర్యకుమారి కొనియాడారు. క్లబ్ చేపట్టిన మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ డయాబెటిక్ వైద్యనిపుణులు పి. శాంతిని క్లబ్ ఆధ్వర్యలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ, వివిధ వృత్తులలో విశిష్ట సేవలందిస్తున్న వారిని ఉచిత రీతిన సత్కరించి గౌరవిస్తూ క్లబ్ ప్రోత్సహిస్తుందన్నారు. కమిటీ సభ్యులు రమాదేవి, ఉషారాణి, శ్యామలా, డాక్టర్లు పి కస్తూరి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శాంతిని సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుధారాణి, సభ్యులు

వీరవల్లిలో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి ప్రధాన రహదారి పక్కన, కూడలికి కూతవేటు దూరంలో గల తానా కార్యదర్శి కసుకుర్తి రాజా ఇంటిలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటిలో కసుకుర్తి రాజా తల్లి బేబీ సరోజిని ఒక్క రే నివసిస్తున్నారు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురవడంతో వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. పనిమనిషి వచ్చే సమయానికి తలుపులు తెరిసి ఉన్నాయి. ఆమె రాజా బంధువులకు విషయం తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. 15 గ్రాములకు పైగా బంగారు వస్తువులు, కొన్ని వెండి వస్తువులు, రూ.25వేల నగదు, విదేశాల నుంచి పంపిన లక్షకు పైగా విలువ చేసే సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీనివాస్ క్లూస్‌టీం సాయంతో వేలిముద్రలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చిందరవందరగా బీరువాలోని వస్తువులు

వరుస చోరీలతో ప్రజల భయాందోళన

వీరవల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా నెల రోజులుగా వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే ప్రధాన రహదారి పక్కన గల దుకాణాల్లో, ఇళ్లలో తాళాలు పగలగొట్టి చోరీలు జరుగుతున్నా పోలీసులు గట్టి చర్యలు చేపట్టటంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా చేపట్టి చోరీలు అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

రోటరీ సేవలు పరిశీలన

ఉయ్యూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రోటరీ నేత్ర వైద్యశాలను రోటరీ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ అమెరికాకు చెందిన మార్క్ మెలోని ఆయన సతీమణి గేమ్‌లోని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ భరత్‌పాండ్యతో కలసి బుధవారం సందర్శించారు. రోటరీ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థ వృద్ధాశ్రమం, నేత్ర, దంత వైద్యశాల వివరాలను జిల్లా పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ ఎస్ సంపత్‌కుమార్ వివరించారు. క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను అధ్యక్షుడు సుబ్రమణ్యం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. క్లబ్ సేవా కార్యక్ర మాలను మార్క్ మెలోని అభినందించారు. పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ శ్యామ్ మొవ్వ, సయ్యద్ అనీస్, చంద్రమోహన్, పులి శ్రీనివాసరావు, ప్రసాదరెడ్డి, అమీర్ మీర్జా, కోటిరెడ్డి పాల్గొన్నారు.





సభలో ప్రసంగిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

త్వరలోనే రాజధాని నిర్మాణ పనులు

● ఎంపీ కేశినేని శివనాథ్

లబ్బీపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణ విషయంలో సీఎం చంద్రబాబు ఒక విజన్‌తో ముందుకు వెళుతున్నారని, నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఏపీ కన్‌స్ట్రక్షన్స్ ఎక్స్‌పోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిల్డర్స్, కాంట్రాక్టర్స్‌కు నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచేలా ఈ ఎక్స్‌పో నిర్వహించటం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నిర్మాణ రంగం అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఎక్స్‌పో నిర్వాహకులు, షైనీ గ్రూప్ అధినేత షేక్ బాజీ, సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి 9 వరకు అంతర్జాతీయ సదస్సు

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసోషియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ), మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నగరంలోని నోవాటెల్ హోటల్ లో న్యూజెన్ టెక్ ఎయిడ్ ఫర్ సస్టైనబుల్ అనే అంశంపై ఈనెల 7నుంచి 9వరకు మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఏఎల్ఈఏపీ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని, అతిథులుగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ఎంఎస్ఎంఈ అదనపు కార్యదర్శి రజనీష్, ప్రపంచ బ్యాంకు ప్రతినిధి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారని తెలిపారు. స్థిరమైన వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు ప్రపంచ వాణిజ్య అవకాశాలు, పరిశ్రమలు వంటి అంశాలపై జరిగే సదస్సుకు అంతర్జాతీయ నిపుణులు హాజరవనున్నట్టు ఆమె తెలిపారు.



పోటీలను పరిశీలిస్తున్న శివారెడ్డి, విద్యాసాగర్

ఆటల పోటీలతో మానసిక ఉల్లాసం

● ఎన్జీవో రాష్ట్ర నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో మహిళా ఉద్యోగులకు రెండో రోజు బుధవారం పలు పోటీలు జరిగాయి. ఈ పోటీలను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కే శివారెడ్డి, ఏ విద్యాసాగర్ తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కుటుంబ, వృత్తిపరమైన ఒత్తిళ్లతో గడిపే మహిళా ఉద్యోగులకు ఈ ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ పోటీల్లో క్యారమ్స్, వ్యాసరచన నిర్వహించారు. నేడు పాటలు, నృత్య పోటీలు జరుగుతాయని సంఘం మహిళా విభాగం చైర్మన్ నిర్మల కుమారి తెలిపారు. ఈ నెల 8న ముగింపు సభ ఎన్జీవోహోంలో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నేతలు

కార్మికులను ప్రైవేటుకు కట్టబెట్టొద్దు..!

● ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు తక్షణమే విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఎన్ఎంఆర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జీవోలు జారీ చేసి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ధర్నా చౌక్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్లుగా డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లు చెల్లించలేదని విమర్శించారు. జీపీఎఫ్ అకౌంట్లు ప్రారంభించకుండా మూడేళ్లుగా ఆర్థికంగా వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నూకరాజు, ఏ సామ్రాజ్యం, బి.సోమయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఏపీ రైతుసంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో జరిగిన నిరసన ప్రదర్శన

రైతులకిచ్చిన హామీలు కేంద్రం నెరవేర్చాలి

● ఏపీ రైతు సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో రైతు ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేసిందని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖా మంత్రి, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ఆం దోళనల్లో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ మద్దతు ధరలు, రైతుల కు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వమే నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేసేందుదు ఉపక్రమించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షు డు గుజ్జుల ఈశ్వరయ్య, సీనియర్ రైతు నేత వై. కేశవరా వు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి, కార్మిక సంఘ నేత కాసాని గణేష్‌బాబు, రైతు నేతలు జీవీ రంగారెడ్డి, వెంకటరెడ్డి, కొప్పుల విజయబాబు ప్రసంగించారు.

రక్షణ కరువు



- బీమా లేని జీవితాలతో కాలం వెళ్లదీస్తున్న రక్షకభటులు
- సిబ్బంది జీపీఎఫ్‌నూ వాడేసుకొన్న గత ప్రభుత్వం
- జీపీఎఫ్ లోన్లకూ అతీగతీ లేదు
- పెండింగులో 7,8 టీఏలు
- అసెంబ్లీలో హోం మంత్రి ప్రకటించినా ఆయిల్‌కు ఇక్కట్లే..!
- ఇన్‌చార్జిల స్వంత ఖర్చుతోనే వెహికల్ రిపేర్లు

విజయవాడ, ఆంధ్రజ్యోతి: పోలీస్ శాఖలో బీమా లేని జీవితాలతో 'రక్షకభటులు' కాలం వెల్లదీస్తున్నారు. ఏపీజీ ఎల్ఐసీ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్) అనేది ఏఆర్, సివిల్, ఏపీఎస్‌పీ పోలీస్ సిబ్బందికి వర్తిస్తుంది. సర్వీసులో చేరినప్పటి నుంచి జీతంతో పాటు నగదు కట్ అవుతూ బేసిక్ పెరిగినప్పుడల్లా ఆ బీమా నగదు కూడా ఎక్కువగా కట్ అవుతుంటుంది. ఇలా కట్ అయిన నగదు వారికి 58 ఏళ్ల వయస్సు వచ్చేసరికి డ్రా చేసుకొనే అవకాశం ఉంది. కానీ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల సిబ్బంది బీమా నగదు ఇచ్చేందుకు బడ్జెట్ లేదనే సమాధానాలు వస్తున్నాయి. దీంతో వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. గత ప్రభుత్వం సిబ్బంది జీపీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) నగదును వాడేసుకొంది. లోన్ల కోసం దరఖాస్తు చేసుకొన్న వందలాది మంది సిబ్బందికి బడ్జెట్ లేదనే సమాధానం వస్తోంది. తమ జీతాల్లోంచి కొంచెం దాచుకొని అవసాన దశలో అవసరాలకు వాడుకొనేందుకు పనికొస్తాయనుకున్న నగదును ప్రభుత్వం వాడుకోవడమేంటని సిబ్బంది ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక రెండు సరెండర్ లీవ్‌ల నగదు కూడా రావాల్సి ఉంది. అలాగే 7, 8 టీఏల నగదు పెండింగ్‌లో ఉంది. రక్షక్ వాహనాలకు నెలకు 180 లీటర్ల అయిల్ ఇస్తుండగా హోం మంత్రి వంగలపూడి అనిత స్వయంగా అసెంబ్లీలో ఆ మొత్తాన్ని 300 లీటర్లకు పెంచి ఇస్తామన్న వాగ్దానం అమలు కాలేదు. 20వ తేదీ వచ్చిందంటే చాలు ఆయిల్ కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. రిపేర్లు కూడా స్వంత ఖర్చులతోనే చేయించాల్సి వస్తోంది. ఎస్ఐ ట్రైనింగ్‌కు, బందోబస్తులకు వెళ్లేవారికి రూపాయి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయవాడ నుంచి దాదాపు 15మంది వెళ్లి తమ స్వంత ఖర్చులతోనే టిఫిన్లు, భోజనాలకు ఖర్చుచేయాల్సి వస్తోంది. తర్వాత బిల్లు పెట్టుకోమని అంటున్నా వాటికీ అతీగతీ లేదు. అసెంబ్లీ సమావేశాలకు, బందోబస్తులకు విజయనగరం, శ్రీకాకుళం వంటి దూరప్రాంతాల నుంచి సిబ్బంది వచ్చి 10 నుంచి 15 రోజులు ఉండి తమ స్వంత ఖర్చులతో డ్యూటీ చేసి వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది సంక్షేమంపై గత ప్రభుత్వం చేసిన పాపాలు నేటికీ శాపాలుగానే మారి వేధిస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. 2023 నుంచి కొత్త పీఆర్‌సీ (పే రివిజన్ కమిషన్) కోసం సిబ్బంది ఎదురుచూస్తున్నారు. కనీసం ఐఆర్ (ఇంటీరియర్ రిలీఫ్) కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలోని పెద్దలు తమ సమస్యలను ఆలకించి న్యాయం చేయాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు తదితరులు

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

● 145 పరీక్షా కేంద్రాల్లో 21,009 మంది అభ్యర్థులు : డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సూచించారు. బుధవారం ఆశీర్వాద భవన్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, డీవైఈవోలు, ఎంఈవోలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో రామారావు మాట్లాడుతూ జిల్లాలో 145 పరీక్షా కేంద్రాల్లో 10,907 మంది బాలురు, 10,102 మంది బాలికలతో మొత్తం 21,009 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో 20,028 మంది ఇంగ్లీషు, 981 మంది తెలుగు మీడియంలో రాయనున్నారన్నారు. ప్రైవేట్ అభ్యర్థులు 1266 మంది హాజరవుతున్నారన్నారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ పోలీసు స్టేషన్ల నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఈ కార్యక్రమంలో బందరు డీవైఈవో శేఖర్‌సింగ్, గుడివాడ డీవైఈవో రవికుమార్, ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి, జిల్లా సీఈ బోర్డు సెక్రటరీ జాన్ సాహెబ్, ఘంటసాల ఎంఈవో మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోడె వెంకట్రామ్, రీతిక రిసెప్షన్

● నూతన దంపతులకు మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీర్వాదాలు
● ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ● సాయంత్రం మంత్రి లోకేష్ హాజరు



బోడె వెంకట్రామ్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి లోకేష్ తదితరులు

పెనమలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్, రీతిక దంపతుల రిసెప్షన్ బుధవారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులను ఆశీర్వదించడానికి పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. బుధవారం ఉదయాన్నే సీఎం చంద్రబాబు నూతన దంపతులను ఆశీర్వదించగా, సాయంత్రం మంత్రి లోకేష్, వంగవీటి రాధా వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం లోకేశ్ బోడె కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. బోడే మనుమరాలితో కాసేపు సరదాగా గడిపారు. అలాగే మంత్రి సవిత, మాజీ మంత్రి పరిటాల సునీత, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, టీడీపీ నేత బుల్లయ్య, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బొండా ఉమా, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య విచ్చేశారు. రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ నూతన వధూవరును ఆశీర్వదించారు. తొలుత ఎమ్మెల్యే బోడె ఇంటికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ గంగాధర్ రావులు ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర హాజరై బోడె వెంకట్రాం, రీతిక దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి 'సిద్ధార్థ' స్వర్ణోత్సవాలు

● స్వర్ణోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతోనే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు కొనసాగుతున్నామని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలకవర్గం అధ్యక్షుడు మలినేని రాజయ్య స్పష్టం చేశారు. సంస్థ స్వర్ణోత్సవాలు డిసెంబర్ వరకు జరుగుతాయన్నారు. ఈ నెల 7న ప్రారంభ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ మమిడాల జగదీష్‌కుమార్ పాల్గొంటారన్నారు. పోస్టల్ కవర్ ఆవిష్కరణతో పాటు ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తామన్నారు. 1975 ఆగస్టు 12న ఏర్పాటైన సంస్థ తొలుత 300 మంది విద్యార్థులు, 25 మంది అధ్యాపకులతో ప్రారంభమై ప్రస్తుతం 18 సంస్థలుగా విస్తరించి 30వేల మంది విద్యార్థులు, 3,500 మంది అధ్యాపకులతో కొనసాగుతుందన్నారు. సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్ మాట్లాడుతూ ఈ స్వర్ణోత్సవాల ప్రారంభ సభలో లోగో ఆవిష్కరిస్తామన్నారు. సిద్ధార్థ అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ విశ్వవిద్యాయలం ఉపకులపతి ప్రొఫెసర్ పీవీ రావు, అకాడమీ సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, సిద్ధార్థ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ వర్శిటీ ప్రొ. చాన్సలర్ ఆచార్య రత్నప్రసాద్, పీబీ సిద్ధార్థ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పాల్గొన్నారు.

ఆశ్రమాల ఆక్రమణల భూములపై చర్చించాలి

● నార్నె వెంకట సుబ్బయ్య

గాంధీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దొంగబాబాలు ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆశ్రమాల పేరుతో అటవీ భూములు, చెరువు, పోరంబోకు, దళితులకు చెందిన అసైన్డ్ భూములు, శ్మశానం భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 20 ఏళ్లకుపైగా దొంగబాబాల ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లాలోని బియెన్ కండ్రిక మండలంలో సర్వే నంబర్ 295లోని రూ.కోట్ల విలువైన అంజూర్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు 21 ఎకరాలు ఆక్రమించారన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలో రామదూత అనే స్వామి చేవూరులోని సర్వే నంబర్ 879లోని భూమిని ఆక్రమించి ఆశ్రమం పేరుతో యాజ్ఞలు, యాగాలు చేస్తున్నారన్నారు. దీనిపై తమ పోరాటం వల్ల 2021లో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా నేటికి స్వాధీనం చేసుకోలేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.లక్ష్మీనారాయణ, జీవీ.రంగారెడ్డి, మైత్రేయబాస్కర్ పాల్గొన్నారు.



దుర్గగుడిలో నిర్వహించిన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవంలో మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకులు

వైభవంగా వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని
కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఫాల్గుణ శుద్ధ షష్టి తిథిని పురస్కరించుకుని మాసావారీ ఆర్జిత సేవగా బుధవారం వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల ప్రార్థనల మధ్య ఈ కల్యాణ ప్రక్రియను అర్చకులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వరుడు, వుధువులుగా భావించి ఈ కల్యాణోత్సవ క్రియలను నిర్వహించారు. ముహూర్త సమయానికి జీలకర్ర, బెల్లం ధారణ ధరింపజేశారు. తొలుత స్వామివారి, అమ్మవార్ల మహా ప్రవర్లను చదివారు. వారి గోత్రాల మేరకు వధువులు, వరుడిని కీర్తిస్తూ వారి వంశ పారంపర్య వైశిష్ట్యాన్ని తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన, పూజ సకల శుభాలను ఇస్తుందని, రాహు, కేతు దోషాలను పరిహరిస్తుందని చెప్పారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ భక్తుల కోలాహలం మధ్యలో మంగళ సూత్ర ధారణ, తలంబ్రాల సమర్పణ చేశారు. చివరిలో మంగళహారతులిచ్చి కల్యాణోత్సవాన్ని ముగించారు. భక్తులు విశేషంగా పాల్గొని వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనుగ్రహం కోరుతూ ప్రార్థనలు చేశారు.

రెండో రోజుకు జాతీయ భద్రతా వారోత్సవాలు



జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏలోని ఓహెచ్ఎస్ (ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ) విభాగం ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. రానున్న కాలంలో రాజధానికి అనేక మంది కార్మికులు వలస వచ్చే అవకాశం ఉందని వారి భద్రత క్షేత్రస్థాయిలో ఎంతో కీలకమని భావించిన అధికారులు ఈ వారోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభు ప్రాథమిక చికిత్స విధానంతో పాటు సీపీఆర్‌పై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తొలి గంటలోనే మనం తీసుకొనే చర్యలే కీలకమన్నారు. సీఆర్‌డీఏ ఓఎం వల్లభనేని శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అజయ్, ఓహెచ్ఎస్ సీనియర్ స్పెషలిస్టు గోపికృష్ణ, పాల్ సుధాకర్, ప్రదీప్, అహరన్ పాల్ పాల్గొన్నారు. తుళ్లూరులోనూ భద్రతపై అవగాహన తరగతులు నిర్వహించారు. సీఆర్‌డీఏ యూనిట్ ఆఫీసులో నిర్వహించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి అనే అంశంపై గుంటూరు డీపీఎంవో డాక్టర్ సిహెచ్.రత్నమోహన్ అవగాహన కల్పిస్తే, సీపీఆర్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసన్ విభాగ అధికారి డాక్టర్ రాధికారాణి చంద్ర అవగాహన కల్పించారు. తుళ్లూరు పీహెచ్‌సీలోని మెడికల్ అధికారులు దాసరి శ్రీనివాస్, ఎన్.వసుంధరతో పాటు ఓహెచ్ఎస్ స్పెషలిస్టు బి.హరికృష్ణ, ఆశా వర్కర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, విలేజ్ లెవల్ వలెంటీర్లు పాల్గొన్నారు.

నేడు అగ్నిప్రమాదాలపై అవగాహన

జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం లెనిన్‌సెంటర్‌లోని సీఆర్‌డీఏ ఆఫీసుతో పాటు తుళ్లూరులోని యూనిట్ ఆఫీసులో ఫైర్ యాక్సిడెంట్‌పై మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

గిరిజన పెయింటింగ్స్‌కు ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో పదేళ్లకు పైబడి నివసిస్తున్న ఆసక్తి గల గిరిజనుల నుంచి ఒక రోజు రాష్ట్ర స్థాయి గిరిజన పెయింటింగ్స్/ఆర్ట్ పోటీలు మరియు ప్రముఖ గిరిజన కళాకారులకు విశాఖపట్నం టీసీఆర్ అండ్ టీఎం వారి అధ్వర్యంలో మార్చి 12న సన్మానం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పెయింటింగ్ పోటీ - ఈవెంట్ / కార్యకలాపం ఈ క్రింది థీమ్‌లపై దృష్టి పెడుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో నివసిస్తున్న గిరిజనులలో పాల్గొనుటకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను కార్యాలయంలో ఈ నెల 8 లోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. డోరునెం. 48-9-10/1, గుణదల, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఫోన్ నెం.9490957017.

సీఎల్‌బీ సైన్స్ టాలెంట్ పరీక్షల్లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శివశంకర్

గుడివాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 15వ సీఎల్‌బీ సైన్స్ టాలెంట్ పరీక్షల్లో స్థానిక త్రివేణి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు పలు ర్యాంకులు సాధించి సత్తా చాటినట్టు పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివ శంకర్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.అస్మికకు రాష్ట్ర 3వ ర్యాంకు, ఎస్.సిరివదన, జె.మనీష్ శ్రీనివాస్‌లు రాష్ట్ర 9వ ర్యాంకులను సాధించినట్టు తెలిపారు. ప్రొఫెసర్ కోదండరామ్ విద్యార్థులకు పతకాలు అందజేశారన్నారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు

సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

గుడ్లవల్లేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో మార్చి 6 గురువారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావు తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొఫిషనల్స్, వీవీఐపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గ్లోబల్ సినారియో అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్ ఆఫ్ డ్రగ్ డిజైన్ ఇన్ ఫార్మాస్యూటికల్ సైన్సస్ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు బుధవారం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొఫిషనల్స్ అధ్యక్షులు ప్రొఫిసర్ రాజీవ్ దహియా, గౌరవ అతిధిగా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీ సురేష్ పాల్గొనున్నారన్నారు. వివిధ ఫార్మశీ కళాశాలల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, దాదాపు 450 మంది హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనాలు

పామర్రు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామానికి సేవలందించే ఉద్యోగుల సౌకర్యార్థం అప్పటి గ్రామ పాలకులు పామర్రులో నిర్మించిన పంచాయతీ భవనాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. 1961-62 మధ్యకాలంలో పామర్రులోని రాళ్లబండి వారి చెరువు దక్షణభాగంలో అప్పటి గ్రామసర్పంచ్ తమ్మా అప్పిరెడ్డి హయాంలో పంచాయతీలో పనిచేసే కార్యదర్శితోపాటు ఇతర ఉద్యోగుల నివాసం కోసం భవనాలు నిర్మించారు. అనాటి ఉమ్మడి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.శివరామప్రసాద్(చల్లపల్లిరాజా) వారి చేతులమీదగా వాటిని ప్రారంభించి, ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చారు. తర్వాతి కాలంలో దశాబ్దాల తరబడి వీటిని వినియోగించకుండా వదిలేయడంతో ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పంచాయతీ భవనాల వద్దే ఓ షెడ్డు నిర్మించి పారిశుధ్య కార్మికుల మస్తర్లు వేసేందుకు ఏర్పాటు చేశారు. కొంతకాలం వాటిని గ్రామ పంచాయతీ శానిటరీ అధికారి కార్యాలయంగా వినియోగించారు. అక్కడే ఖాళీగా ఉన్న పంచాయతీ ఉద్యోగుల భవనాలను పట్టించు కోలేదు. దీంతో భవనాలపై శ్లాబ్ దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిల్లో విషపూరితమైన పురుగులు, పాములకు ఆవాసకేంద్రాలుగా మారాయని సమీప ప్రాంతాల్లోని గృహ యజమానులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న ఆ భవనాలకు మరమ్మతులు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో పామర్రు గ్రామ పంచాయతీ భవనాలు



చల్లపల్లి రాజా ప్రారంభించిన భవనాల శిలాఫలకం

క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయిస్తాం

శిథిలమైపోతున్న గ్రామ పంచాయతీ ఉద్యోగుల క్వార్టర్స్‌ను తాను ఇప్పటికే పరిశీలించాను. వాటిని తక్షణమే మరమ్మతులు చేసి వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

జ్యోతి ,ఎంపీడీవో

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

నందివాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ ఆదేశాల మేరకు నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నందివాడ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహిళల సాధికారిత హక్కుల సమానత్వం వంటి కీలక విషయాలపై తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో వ్యక్తపరిచారు. విజేతలకు మార్చి 8వ తేదీన పోలీసు అధికారులచే బహుమతులు అందజేస్తామన్నారు.

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం మోటూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందుగా బాలికలకు వివిధ అంశాలపై పెయింటింగ్ పోటీలు ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి మార్చి 8వతేదీన బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం : సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న భానుశ్రీ

పామర్రు,మార్చి5(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సి.భానుశ్రీ అన్నారు. పూర్వ బాల్యదశ సంరక్షణ(ఎర్లీచైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ వేడుకను స్థానిక 18వార్డు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన భానుశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీ చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యనందించడం ద్వారా చిన్నారులు ఒకటో తరగతిలో చేరేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషకాహారం సద్వినియోగంచేసుకుని ఆరోగ్యవంతమైన సమాజంలో భాగస్వాములుగా నిలవాలన్నారు. సూపర్‌వైజర్ సత్యశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వారికి సకాలంలో పంపిణీచేసే బాధ్యతను అంగన్వాడీలు విస్మరించకూడదన్నారు. ప్రతీనెల ఐదోతేదీన ఈసీసీఈడేలో తల్లిదండ్రులకు అంగన్వాడీ చిన్నారుల అభివృద్ధిని వివరించడమేగాక అంగన్వాడీల బలోపేతానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, ఏఎన్ఎం విజయభాను, ఎంఎల్‌పీహెచ్ స్టీఫెన్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న శేషగిరి

గుడ్లవల్లేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని సేవాతత్పరులను లయనిజంలోకి ఆహ్వానించి వారి సేవలను లయనిజం ద్వారా సమాజానికి చేరువచేద్దామని జిల్లా లయన్స్ గవర్నర్ గద్దే శేషగిరి పిలుపునిచ్చారు. జిల్లా గవర్నర్ అఫిషియల్ విజిట్ లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరులో ఆయనపాల్గొని ప్రసంగించారు. గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ద్వారా ఈ ఏడాది నిర్వహించిన సేవలను అభినందించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళకు ప్రశంసాపత్రాన్ని ఆయన అందజేశారు. ఇరువురు మహిళలకు చేయూతనిచ్చేందుకు కుట్టుమిషన్లను నెప్రూహాపశువుల సంతగ్రామాభివృద్ధి సంఘం వారిచే స్పాన్సర్ చేసిన కుట్టుమిషన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం పోలవరపు జగదీశ్వరరావు వారి తండ్రి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన రూ. 48,000లను 12 మంది ఐటీఐ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 4000 చొప్పున పోలవరపు రాజశ్రీ చేతులమీదుగా అందజేశారు. ఇద్దరు చిరు వ్యాపారులకు గొడుగులను యర్రంరెడ్డి గాంధీ వితరణతో అందజేశారు. అనంతరం గవర్నర్ గద్దే శేషగిరి, విజయలక్ష్మి దంపతులను సన్మానించారు. మాజీ లయన్స్ గవర్నర్లు ఏఆర్‌కే చౌదరి, వైపీసీ ప్రసాద్, కార్యదర్శి మేరుగు పెరుమాళ్ల, బాపయ్యచౌదరి, ఆర్‌సీ రాంబాబు, చక్రధర్, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుడివాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక 12వవార్డు నైజాంపేటకు చెందిన పెయింటర్ షేక్ హుస్సేన్ బేగ్, 17వ వార్డు ఆదర్శనగర్‌కు చెందిన అర్జ నాగశ్రీనివాసరావులు ప్రమాదవశాత్తు కిందపడి చెయ్యి గూడు జారింది. వారికి సీఐటీయూ అనుబంధ సంస్థ ది కృష్ణా జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూ నియన్ అండగా నిలిచి చెరో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేసింది. యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు ఆంజనేయులు, రఫీద్‌బేగ్, మొహిద్దీన్, కల్వకుంట నాగరాజు, షేక్ ఖాజా, రాంబాబు, రహమాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లె నిద్ర

పెదపారుపూడి: జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు పెదపారుపూడి మండల పరిధిలో ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మోపర్రు గ్రామసచివాలయం వద్ద గ్రామసభ (పల్లె నిద్ర) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు , నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే వెంటనే 1930కి సమాచారమందించాలని కోరారు. బోయిన సాంబశివయ్య, జూపల్లి వెంకటరావు, రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిందితులకు 19 రోజుల రిమాండ్

గుడివాడ రూరల్: తట్టివర్రు గ్రామానికి చెందిన నగుళ్ల రాఘవమ్మ (65) మనస్థాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెకు చెందిన 8 సెంట్ల స్థలాన్ని ఆమె అమ్ముకునే ప్రయత్నం చేయగా, ఆమె కొడుకు సత్యనారాయణ, కోడలు లక్ష్మీ, మనుమడు గంగాధరరావు అడ్డుకుని ఆమెను మానసికంగా వేధించారు. ఆమె మృతికి కారణమైన కొడుకు నగుళ్ల సత్యనారాయణ, కోడలు లక్ష్మీ, మనుమడు గంగాధర్‌రావును బుధవారం అరెస్టు చేసి 19 రోజులు రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

రెండో రోజు ఘనంగా వీకేఆర్ ఫెస్ట్-2025



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రసాదరావు

గుడివాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో వీకేఆర్ ఫెస్ట్-2025కు విశేష స్పందన లభిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం రెండోరోజు ప్రాజెక్టు ఎక్స్పో, టెక్నికల్ క్విజ్, బ్రేక్ ది క్వైరీ, క్రాక్ ది కోడ్, మ్యాసివ్ స్టేట్మెంట్ ఆఫ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్, క్లిక్ ఆఫ్ ఫోటోగ్రఫీ, యూఐ ఫోర్ట్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫెస్ట్‌లో పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటుగా ఎమ్‌టెక్, ఎంబీఏ విద్యార్థులు సుమారు 1700మంది పాల్గొన్నారు. విద్యార్థులకు అకాడమిక్ ఈవెంట్స్‌తో పాటు ఆటపాటలు, వినోదం, సాహసకృత్యాలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ ఫెస్ట్‌లో కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, అకాడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ఫెస్ట్ కన్వీనర్ కొల్లిపర దుర్గప్రసాద్, డీన్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సమ్మెకాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

తోట్లవల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సమగ్ర శిక్షా అభియాన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తోట్లవల్లూరు ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలియజేశారు. గత ప్రభుత్వహయాంలో 2023 డిసెంబర్ 20 నుంచి జనవరి 10 వరకు సమ్మె నిర్వహించామని, ఆ తరువాత ప్రభుత్వంతో ఒప్పందం మేరకు సమ్మె విరమించామన్నారు. ఆ సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ అమల్జేయాలన్నారు. దీంతోపాటుగా పదవీ విరమణ వయస్సు 62కి పెంచాలని, గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అమలు చేయాలనే డిమాండ్లను ప్ల కార్డులపై రాసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జాన్‌మోడీ, పోతురాజు, రాకేష్, హరిప్రసాద్, నాగబాబు, ప్రభోద, ప్రసాద్, నిరుపమ పాల్గొన్నారు.

మినుము తీత పనుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు మినుము తీత పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి బోలెం అనంతలక్ష్మి రైతులకు సూచించారు. రామన్నపూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పంట ఎక్కువ శాతం కాయలు తయారైన తర్వాతనే మినుము తీతలు మొదలు పెట్టాలని కోరారు. మినుము తీత ప్రారంభించే ముందు ఎటువంటి పురుగు మందులు పిచికారి చేయవద్దని తెలిపారు. మినుము పంట కోసిన తర్వాత పొడిగా ఉన్న ప్రదేశంలో మినుము గుట్టలు వేయాలని రైతులకు సూచనలు చేశారు. మినుము గుట్టలు క్యాప్ ఆకారంలో వేసుకున్నట్లైతే గాలి, వెలుతురు, సూర్యరశ్మి మినుము పంటకు తగులుతుందన్నారు. పోసిన గుట్టలను ఒక రకం గుట్టలను వేరే రకం గుట్టల్లో కలపవద్దని తెలిపారు. ప్రతీ రైతు తాము పండించిన మినుము పంటను జాగ్రత్తగా నూర్చుకుని ఇంటికి చేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన స్క్వాడ్ బృందం

కూచిపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల తీరుతెన్నులను సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు టి.వి.ఎస్.ఎన్.శ్రీనివాస్ బృందం ఫ్లయింగ్ స్క్వాడ్ ఎ.శ్రీనివాసరావు, ఎస్.సుభాషిణిల బృందం తనిఖీలు నిర్వహించారు. 142 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 139 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. సీఎస్‌గా డి.సుధాకర్, డీవోగా ఎం.వి. గంగాధర్‌లు వ్యవహరించారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పించాలి

గుడివాడ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గ్రామాల్లో పూర్తిస్థాయిలో లక్ష్యాలను పూర్తి చేయాలని ఏపీవో దేవానందం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పించేలా చూడాలన్నారు. ప్రతీరోజు కార్మికులకు వేసిన మస్తర్లు మండల కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఎంపీడీవో డీవై.విష్ణుప్రసాద్ మాట్లాడుతూ గుడివాడ మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో పనులన్ని ఇచ్చితంగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను కోరారు. రామకృష్ణ, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూడో రోజుకు గంగానమ్మతల్లి జాతర



పోతురాజుగెడలకు పూజలు చేస్తున్న భక్తులు

పామర్రు, మార్చి05 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే మహాతల్లిగా భక్తులచే పూజలందుకుంటున్న పామర్రు గంగానమ్మతల్లి జాతర మహోత్సవం బుధవారం మూడోరోజుకు చేరుకుంది. తెల్లవారుజామునే ఆలయంనుంచి బయలుదేరిన అమ్మవారిఘటం, పోతురాజుగెడల సంచారయాత్ర పూర్వపు మునసబు వారసుల ఇంటివద్ద తొలి నైవేద్యాన్ని స్వీకరించారు. అనంతరం స్థానిక బాపూజీపేట, గౌడ బజారు, నాయుడుపేట బజారుల్లో ప్రత్యేక డప్పు, వాయిద్యాల నడుమ అమ్మవారి సంచారయాత్ర కొనసాగింది. అమ్మవారిఘటం, పోతురాజుగెడలకు భక్తులు వేపాకులు, పసుపు కలిపిన నీటితో చల్ది నైవేద్యాలు సమర్పించారు. పూనకాలువచ్చిన మహిళలకు పంబలవారు నిమ్మకాయ, కొబ్బరిటెంకాయలను కొట్టి వాళ్లను శాంతపరిచారు. ఎలాంటి అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

దండిగాదపూడి గ్రామానికి అందని రేషన్

నందివాడ: ప్రతీనెలా ఇచ్చే రేషన్ ఈ నెల 5వ తేదీ వచ్చిన దండిగాదపూడి గ్రామ రేషన్‌దారులకు రేషన్ పంపిణీ జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 300 రేషన్ కార్డులు ఉండగా, ఇంత వరకు ఒక్క కార్డుకూ రేషన్ ఇవ్వకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ డీటీ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా ఈ నెల రేషన్ డీలర్ ఇంటి వద్దనే లబ్ధిదారులకు రేషన్ అందజేశామన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో జీవించాలి



దీక్షాపరులకు జపమాల వేస్తున్న గుజ్జుల మైఖేల్

గుడివాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మానవునిలోని చెడును పారద్రోలేందుకు క్రైస్తవ ఉపవాస దీక్షలను చేపట్టిన ప్రతి ఒక్కరూ క్రీస్తును పోలి జీవించాలని ఫాదర్ గుజ్జుల మైఖేల్, శ్రీకాంత్‌లు తెలిపారు. స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కర్మేల్ చర్చి(ఆర్‌సీఎం)లో విచారణగురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయ గురువులు జాన్ హారీష్‌లు దివ్య బలి పూజలను నిర్వహించి, దీక్షలను ప్రారంభించారు. పారీస్ కమిటీ ఛైర్మన్ ఏలేటి విలియం జోషి, సభ్యులు శ్రీనివాసరావు, జీవరత్నం పాల్గొన్నారు.

నందివాడ: మండలంలోని క్రైస్తవులు తెల్ల వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో బుధవారం దీక్ష తీసుకుంటున్నట్టు పొలుకొండ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అనీల్ తెలిపారు.

పెదపారుపూడి: క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉపవాస దీక్షల శ్రమదినాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన పెదపారుపూడి రక్షణనైన దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.430

నేటితో ముగియనున్న ఈ-కేవైసీ గడువు

ఘంటసాల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రబీ 2024-25 పంట కాలంలో ఈ-కేవైసీ నమోదుకు గురువారం వరకు తుది గడువు ఉందని, ఇంకా నమోదు చేయించుకోని రైతులు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి నమోదు చేయించుకోవాలని ఏవో కె.మురళీకృష్ణ సూచించారు. మండలంలో 18,522 ఎకరాల్లో సాగుచేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఆయన తెలిపారు. అపరాలు, మొక్కజొన్న సాగు చేసిన రైతులు పంటలకు ఈ-కేవైసీ నమోదు చేయించుకుంటేనే కనీస మద్దతు ధర పొందగలరని ఏవో మురళీకృష్ణ తెలిపారు.

జగన్‌రెడ్డీ..సభ్యతతో మాట్లాడడం నేర్చుకో

● ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై సంస్కారం లేని మాటలు సరికాదు: బూరగడ్డ వేదవ్యాస్



మచిలీపట్నం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో నైతిక విలువలే ఊపిరని, కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాటికి తిలోదకాలిచ్చి సభ్యత లేకుండా మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ధ్వజమెత్తారు. బుధవారం మచిలీపట్నంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్‌రెడ్డి మాట్లాడిన భాష ఆయన స్థాయికి తగినది కాదని, దిగజారి మాట్లాడారని అన్నారు. భాష సంస్కారాన్ని చాటి చెబుతుందని, పది మందిని ఆకట్టుకునేలా ఉండాలి కానీ, బాధపెట్టేదిగా ఉండకూడదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేసి గెలవడానికి అవకాశం కల్పించారన్నారు. పవన్‌కల్యాణ్ సినీరంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ ప్రత్యేక ముద్ర వేశారన్నారు. రాజకీయ చతురతతో బీజేపీతో కలిసి టీడీపీ, జనసేన కూటమిగా పోటీ చేయడం వల్లే కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన నిదులు వస్తున్నాయన్నారు.

నోరు అదుపులో పెట్టుకో జగన్

● 11 స్థానాలకు పడిపోయినా మార్పు రాలేదా?: రాయపూడి వేణుగోపాలరావు

అవనిగడ్డ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై స్థాయి దిగజారి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు హితవు పలికారు. బుధవారం అవనిగడ్డలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌పై జగన్ మాట్లాడిన భాష సరికాదన్నారు. ఓట్లేసిన తెలుగు ప్రజలను అవమానపరిచేలా ఉందన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన జగన్ దిగజారి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయి 151 నుంచి 11 స్థానాలకు పడిపోయినా ఇంకా మార్పు రాలేదా జగన్ అని నిలదీశారు.

దేవాంగులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

● కూటమికి సంఘ రాష్ట్ర కార్యదర్శి పడవల మోహన త్రినాథ్ విజ్ఞప్తి

గూడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేవాంగులకు ఒక ఎమ్మెల్సీ ఇవ్వాలని కూటమిని దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి పడవల మోహన త్రినాథ్ కోరారు. బుధవారం గూడూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాష్ట్రంలోని దేవాంగులకు ఎలాంటి ప్రాధాన్యం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం ఎమ్మెల్సీ ఇచ్చి దేవాంగుల అభ్యున్నతికి పాటుపడాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వైద్యురాలి నిర్లక్ష్యానికి ఎనిమిది నెలల గర్భిణి మృతి

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైద్యురాలి నిర్లక్ష్యానికి ఎనిమిది నెలల గర్భిణీ మృతిచెందింది. ఈఘటన బందరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగింది. పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన కట్టా నాగదుర్గామల్లేశ్వరి (28) ఎనిమిది నెలల గర్భిణీ. నోబుల్ కళాశాల రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పరీక్షలు చేయించుకునేందుకు మంగళవారం వచ్చారు. మధ్యాహ్నం ఉమ్మనీరు తక్కువగా ఉందని వైద్యురాలు ఒక ఇంజక్షన్ ఇచ్చారు. సాయంత్రం రమ్మనమని చెప్పారు. ఈలోగా ఫిట్స్ వచ్చి నాగదుర్గామల్లేశ్వరి పరిస్థితి విషమించింది. ఆసత్రిలోనే మృతిచెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నాగదుర్గామల్లేశ్వరికి విజయవాడకు దగ్గరలోని నైనవరానికి చెందిన నాగమురళితో వివాహమయింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దుర్గామల్లేశ్వరి మృతి చెందడంతో భర్త మురళి కన్నీరుమున్నీరయ్యారు.

రెండు వైన్ షాపులు సీజ్

పెడన, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు వైన్‌షాపులను ఎక్సైజ్‌శాఖ మచిలీపట్నం అధికారులు బుధవారం సీజ్ చేశారు. చేవేంద్ర గ్రామంలోని ఆదిత్య వైన్‌షాపు నుంచి, బల్లిపర్రులోని దేవి వైన్‌షాపు నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా అవుతోందని గుర్తించిన ఎక్సైజ్ అధికారులు ఆ రెండు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేసి, సీజ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు
కూటమి సుపరిపాలనకు నిదర్శనం

విజయోత్సవాల్లో టీడీపీ నేతలు

అవనిగడ్డ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ఆ పార్టీ నేతలు పలువురు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడంతో బుధవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావు, షేక్ బాబావలి, మెరుగు సోమిరెడ్డి, తూమాటి మల్లి, తూమాటి ప్రసాద్, కొల్లూరి వాసు, గుగ్గిలం శ్యామ్ పాల్గొన్నారు.

టీడీపీ బందరు నేతల ఆధ్వర్యంలో..

మచిలీపట్నం టౌన్: పోలింగ్ ఈవీఎంలలో జరిగినా, బ్యాలెట్‌లో జరిగినా గెలుపు కూటమి అభ్యర్థులదేనని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీతో గెలవడంతో టీడీపీ నాయకులు బుధవారం శిడింబి అగ్రహారంలో విజయోత్సవం జరిపారు. ఎమ్మెల్సీ ఓట్లను ఆన్‌లైన్‌లో భారీగా చేర్పించి ఆలపాటి గెలుపులో కీలకపాత్ర పోషించిన గోపీచంద్‌ను సత్కరించారు. మెగా డీఎస్సీని త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సారథ్యంలో నియోజకవర్గంలో టీడీపీ మరింత పటిష్టపడిందని గోపీచంద్ అన్నారు. కార్పొరేటర్ దేవరపల్లి అనిత, టీడీపీ నేతలు పిప్పళ్ల వెంకట కాంతారావు, పి.వి.ఫణికుమార్, కరెడ్ల సుశీల, కాగిత రామకృష్ణ, పెద్ది వెంకయ్య, ప్రైవేట్ పాఠశాలల సంఘ నాయకుడు కాగిత సాంబశివరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, బందరులో గొర్రెపాటి గోపీచంద్‌ను సత్కరిస్తున్న నాయకులు

రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో..

మచిలీపట్నం టౌన్: ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు సాధించినందుకు రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవాలు నిర్వహించారు. మచిలీపట్నం కూనపరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిత్ర మండలి నాయకులు బుల్లెట్ ధర్మారావు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, టీడీపీ నాయకులు పి.వి.ఫణికుమార్, లంకిశెట్టి నీరజ, బడుగు ఉమాదేవి, బీజేపీ నాయకుడు సూరిశెట్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి అభినందన

అవనిగడ్డ: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు బొబ్బా గోవర్ధన్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పనితీరును చూసి పట్టభద్రులంతా మద్దతుగా నిలిచినందున వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా పెద్దల సభలో వాణిని వినిపించాలని ఆయన కోరారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎన్నారై బొబ్బా గోవర్ధన్



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పెడన, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాధ్యతాయుతంగా పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము తెలిపారు. షాదీఖానాలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పెడన మునిసిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగులు రాము సమక్షంలో సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాము తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ జరిపిన కృషి వల్లే సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించారని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు సరైన దిశా నిర్దేశం లేదని, జాబ్‌చార్టు లేదని సంఘ జిల్లా కార్యదర్శి డీవీవీఎస్ వరప్రసాదరావు అన్నారు. ప్రమోషన్లు, జీతాల పెంపు, జాబ్‌చార్టులపై దృష్టి పెడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ డైరీని ఆవిష్కరించారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం పట్టణ కమిటీ

పెడన: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పట్టణ శాఖకు నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పి.జితేంద్ర, ఉపాధ్యక్షుడిగా కె.పూర్ణచంద్రరావు, జనరల్ సెక్రటరీగా విజయకుమార్, కోశాధికారిగా షజులున్నీసా బేగం, జాయింట్ సెక్రటరీగా బి.వి.నాగాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రామయ్య, జీవనజ్యోతి నియమితులయ్యారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

● అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం



మచిలీపట్నం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఈనెల 8వ తేదీన జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ రంగాల్లో రాణించి, అద్భుత విజయాలు సాధించిన మహిళలను గుర్తించి, వారిని సముచితంగా గౌరవించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ఆయా విభాగాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐసీడీఎస్, మెప్మా, మైనారిటీ, వైద్య, ఆరోగ్యశాఖ, పోలీస్ విభాగాల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జేసీ గీతాంజలి శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లక్ష్మీటాకీసు సెంటర్‌లో బుధవారం భారీ సంఖ్యలో ఆక్రమణలు తొలగించారు. డ్రెయిన్లపై నిర్మించిన పక్కా షాపులను ఎస్కవేటర్లతో తొలగించారు. కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో మునిసిపల్ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.



లక్ష్మీటాకీసు సెంటర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బాలసాయి విద్యార్థులు 49 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో బాలసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు 49 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జగదీష్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికయిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధిని సాధించాలని స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి కె.ఝాన్సీలక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం 45వ డివిజన్‌లోని ఇండోర్ స్టేడియంలో మహిళలకు ఉచిత యోగా శిక్షణ, కరాటే తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఝాన్సీలక్ష్మి అధ్యక్షత వహించారు. మచిలీపట్నంను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి కొల్లు రవీంద్ర కృతనిశ్చయంతో ఉన్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. సీడీపీవో కె.గ్లోరీ, యోగా మాస్టర్ మద్దాల చింతయ్య, సునంద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి ఝాన్సీలక్ష్మి

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నిమ్మలతోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ముద్రాంగ అర్చన, పంచహారతి, శేమేళి, గణపతిహోమం, అయ్యప్పస్వామికి అష్టాదశ కలశాభిషేకం, అన్నాభిషేకం పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు భాను నంబూద్రి జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, కమిటీ పెద్దలు మార్గాని చంద్రశేఖరరావు, ఆకుల ధనుంజయరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, మునంగి శివ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రావులపల్లి పండు గురుస్వామి పాల్గొన్నారు. అర్చకులు భాను నంబూద్రి, కమిటీ పెద్దలు అన్నవరపు పాండురంగారావు, ఆకుల పృధ్వి, యర్రంశెట్టి వెంకటేశ్వరరావులు వెంకట్రామ్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఐదు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

14న లక్ష్మీనారాయణ కల్యాణం

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లక్ష్మీజయంతి సందర్భంగా జగద్గురు రామానుజాచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 17వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని రామానుజ సంస్థాన్ నిర్వాహకుడు గుడిమెళ్ల శ్రీనివాస శ్రీకరస్వామి తెలిపారు. బుధవారం బలరామునిపేటలోని రామానుజ సంస్థాన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14న లక్ష్మీనారాయణ కల్యాణం, 15న 108 గరుడ వాహనాలపై దేవతామూర్తుల భారీ ఊరేగింపు, 16న హయగ్రీవస్వామి అర్చనలు, నారసింహ కల్యాణం, 17న యతిరాజ పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు. త్రిదండి రామచంద్ర రామానుజజీయర్ స్వామి, త్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామి, త్రిదండి బృందావన జీయర్ స్వామి, త్రిదండి శఠగోపముని జీయర్ స్వామి, ప్రణావనందదాస్, స్థలసాయి స్వామి పాల్గొని అనుగ్రహ భాషణం చేస్తారన్నారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన

మోపిదేవి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పంటల్లో తెగుళ్ల నివారణకు సమర్థవంతంగా పనిచేసే నీమాస్త్రం(వేప నూనె) తయారీపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు ప్రదర్శనాపూర్వకంగా అవగాహన కల్పించారు. పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రావివారిపాలెంలో రైతులకు నీమాస్త్రం తయారీ, వినియోగించే విధానాన్ని వివరించారు. ఎరువులు చల్లేటప్పుడు, పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో నీమాస్త్రం తగిన మోతాదులో వినియోగిస్తే తెగుళ్లు, పురుగులు ఆశించటాన్ని కొంతమేర నివారించుకోవచ్చన్నారు. పెట్టుబడి తగ్గించుకోవడానికి నీమాస్త్రం దోహదపడుతుందని, రైతులు ఇంటి వద్దే తయారు చేసుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ సుధారాణి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బోనం పాపారావు కుటుంబసభ్యులకు పరామర్శ

నాగాయలంక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోనం పాపారావు కొద్ది రోజుల క్రితం మరణించగా ఆయన కుటుంబసభ్యులను బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, పాపారావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ నేతలు బండ్రెడ్డి హరి, తోట దామోదర్ రావు, దుడ్డు మురళి పాల్గొన్నారు.

వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేకనూరు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా పంచగవ్య చవన ప్రాసన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, క్షీరాధివాసం, జలాధివాసం కార్యక్రమాలను అర్చకుడు దీవి వెంకట రాఘవ కృష్ణమాచార్యుల బ్రహ్మత్వంలో 11 మంది రుత్వికులు వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామోత్సవం, నవకలశ స్థాపన, ప్రధాన హోమం కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి తొడుగు బహూకరణ

చల్లపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలోని ఉపాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు వెండి తొడుగును బహూకరించారు. నంబూరి శ్రీనివాసరావు దంపతులు కిలో వెండిని అందజేయగా, యడవల్లి కృష్ణచైతన్య, కంచర్ల పాండురంగదాసు, పండమనేని విమల, కూరపాటి వెంకట రాజశేఖర్‌లు మరో కిలో వెండిని అందజేశారు. రూ.రెండు లక్షల విలువైన వెండితో స్వామికి తొడుగును తయారుచేసి బుధవారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ పెద్దలకు అందజేశారు.



స్వామికి వెండి తొడుగు అందిస్తున్న దాత నంబూరి శ్రీనివాసరావు దంపతులు

బలరామునిపేటలో ఇరువర్గాల పరస్పర దాడులు

● పదిమందికి గాయాలు..కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బలరామునిపేటలో ఇరువర్గాలు బుధవారం పరస్పర దాడులకు దిగిన ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. ఎస్సై యోహాన్ ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తమ కుటుంబ సభ్యులను అసభ్యంగా మాట్లాడుతున్నావేంటని కొమ్మిడి కొండాను తన్నీరు రాజేష్ ప్రశ్నించాడు. మా ఇంటి ముందు వేగంగా వాహనం నడుపుతావేంటంటూ రాజేష్‌పై మరో నలుగురితో కలిసి కొండా దాడికి దిగాడు. దీనికి ప్రతిగా రాజేష్ మరో నలుగురితో కలిసి కొండాపై దాడికి దిగారు. ఈ పరస్పర దాడుల్లో పదిమందికి గాయాలయ్యాయి. పదిమందిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. రాజేష్, కొండాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై ఎస్సై కేసు నమోదు చేశారు.

అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లు సీజ్

చల్లపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆముదార్లంకలోని కృష్ణానదీ తీరం నుంచి ఇసుకను అనధికారికంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఆముదార్లంక రేవులో ఇసుక రవాణా జరుగుతోందనే సమాచారంతో ఏఎస్సై యు.వెంకటేశ్వరరావు, స్టేషన్ రైటర్ కె.రమేష్, వీఆర్వో పి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులను చూసి ఇసుకను లోడింగ్ చేసుకున్న ట్రాక్టరు డ్రైవర్లు పారిపోయేందుకు యత్నించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. 8 ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

40 రోజుల ఉపవాస దీక్షలు ప్రారంభం

చల్లపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సాలిపేట ఆర్సీఎం చర్చిలో విభూది బుధవారం సందర్భంగా ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. తపస్సుకాలంలో దానధర్మాలు, ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు అంశాలపై అనుసరించాల్సిన విధానాలను ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్ వివరించారు. ప్రతి శుక్రవారం సాయంత్రం చర్చిలో పరిశుద్ధ శిలువమార్గం, దివ్యసత్ప్రసాద ఆరాధన, దివ్యబలిపూజ, వాక్య పరిచర్య, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యబలిపూజ, దివ్యసత్ప్రసాదం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విశ్వాసులు 40 రోజుల ఉపవాస దీక్షలను తీసుకున్నారు. దివిసీమలోని 12 గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.



వాక్యోపదేశం చేస్తున్న ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్

80 మంది రక్తదానం

పెడన రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 80 మంది రక్తదానం చేశారని సొసైటీ ప్రతినిధి బి.శంకర్‌నాథ్ తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్, జి.రమేష్ పాల్గొన్నారు.

నేడు నాంచారమ్మ జాతరపై సమీక్ష

కోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ ఆలయ ప్రాంగణంలో అమ్మవారి జాతరపై గురువారం సాయంత్రం మూడు గంటలకు అధికారులతో మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఆరోగ్య, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఫిషరీస్ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.